# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 176 శనివారం 07- 03 - 2026 పేజీలు : 8 వెల. 2/-

Printed by Guntur, Prakasam, Krishna , Circulated From Guntur, Prakasam, Krishna , Kakinada, Anantapur, NTR, Ongole, Visakapatnam, Eluru, Telangana



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349



ముఖ్య ప్రకటనలు

మీ ఇంట వివాహాది శుభకార్యములు
మీ పెళ్లిరోజు, పుట్టినరోజు మరియు
మీ వ్యాపార ఇతర కార్యముల కొరకు మా పత్రికలో
అతి తక్కువ ధరలకు ప్రకటనలు వేయబడును.
ఇతర వివరముల కొరకు
క్రైం కౌంటర్ దినపత్రిక ఉమ్మడి రాష్ట్రం కార్యాలయం
సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్

Ph.No: 98497 07349


# 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్

## సీఎం కీలక ప్రకటన





**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** రాష్ట్రంలో 13 ఏళ్లలోపు వారికి సామాజిక మాధ్యమాలను బ్యాన్ చేసే అంశంపై చర్చిస్తున్నామని ఏపీ శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు నష్టపోవడానికి వీల్లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో విచ్చలవిడితనంపై ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ఓ సిఫార్సు కూడా చేశారని సీఎం తెలిపారు. ద్రవ్యవినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం ప్రసంగించారు. రాష్ట్రంలో 25 నూతన పాలసీలు తీసుకురావటం ద్వారా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. వీటితో 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు.

**పల్లెల్లో కొత్త వెలుగులు...**

రాష్ట్రంలో అభివృద్ధికి అవరోధంగా ఉన్న నాలా చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి అవినీతిని కట్టడి చేశామని సీఎం చెప్పారు. జన్ విశ్వాస్ ద్వారా పాత చట్టాలను మారుస్తున్నామని.. దీనికి సంబంధించి బిల్లుకు కూడా శాసనసభ ఆమోదం తెలిపిందని సీఎం తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో 884 కి.మీ సీసీ రోడ్లు, 234 కిలోమీటర్ల బీటీ రోడ్లు వేశారని ముఖ్యమంత్రి వివరించారు. 4,998 కిలోమీటర్ల సీసీ రోడ్లను కేవలం 20 నెలల్లో పూర్తి చేయించేలా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకున్నారన్నారు. పల్లె పండుగ, అడవి తల్లి బాట పేరిట గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గోశాలల నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. 9 కోట్ల పనిదినాలు కల్పించేలా కూడా ఉ పముఖ్యమంత్రి చర్యలు తీసుకున్నారని సీఎం తెలిపారు. నరేగా నుంచి వీబీజీ రామ్ జీ పథకానికి మార్పు జరిగిందన్నారు. బడ్జెట్ తగ్గకుండా ఆ పథకాన్ని సమర్థంగా వినియోగించుకుందామన్నారు సీఎం. పల్లెల్లో కొత్త వెలుగులు చూసేందుకు ఉప ముఖ్యమంత్రి తీసుకుంటున్న కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలోనూ వివిధ సంస్కరణల్ని అమలు చేసి నైపుణ్యం పెంచేలా చర్యలు చేపడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీ..**

స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలతో స్వర్ణాంధ్ర విజన్ తయారు చేసుకున్నామని సీఎం తెలిపారు. అభివృద్ధి వికేంద్రీకరణ జరిగేలా నిర్ణయం తీసుకుంటున్నామని.. మూడు ప్రాంతాల్లో ఎకనామిక్ రీజియన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుప్రీం కోర్టు అనుమతితో కర్నూలుకు హైకోర్టు బెంచ్ సాధించుకునేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో 5 లక్షల మంది మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే అంశంపై సంకల్పం చేస్తామన్నారు. ఉగాదికి 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించేలా చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఏపీని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపడుతున్నామన్నారు ముఖ్యమంత్రి.

**వారికి అదే చివరి రోజు...**

సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గిన్నీస్ రికార్డు సాధించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డేను నిర్వహించామన్నారు. యోగా, నేచురోపతి లాంటి అంశాలను మేళవించి ప్రజారోగ్యాన్ని కాపాడతామని తెలిపారు.

2 లో




## బొత్సకు మరోసారి అస్వస్థత

**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీ శాసనమండలిలో వైసీపీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. హైబీపీతో ఇబ్బంది పడుతున్న బొత్స.. మండలిలో మాట్లాడుతుండగా కింద పడబోయారు. దీంతో వెంటనే అసెంబ్లీ అధికార వర్గాలు అత్యవసరంగా వైద్యులను పిలిపించి, ఆయన ఛాంబర్‌లోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత.. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని తెలిపారు. బీపీలో హెచ్చుతగ్గులు, సరైన సమయానికి భోజనం చేయకపోవడం వంటి కారణాల వల్ల ఆయన స్వల్ప అస్వస్థతకు గురయ్యారని వైద్యులు వివరించారు. విశ్రాంతి తీసుకోవాలని, అవసరమైతే మరిన్ని వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అలాగే, బొత్సతో హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పిటల్ వైద్యుడు డాక్టర్

2 లో



# అభివృద్ధికోసం

## కలసి ముందుకెల్దాం

**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి నేతలందరం ఐక్యంగా ముందుకెళ్దామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ (ఘ్ఝుఝుఅ ఖుశ్రీఝుఅ) వ్యాఖ్యానించారు. కూటమి చాలా బలంగా ఉండాలనేది తన ఆకాంక్ష అని ఉద్ఘాటించారు. ఏపీ అభివృద్ధి కోసమే

2 లో

# రైసినా డైలాగ్-2026 సదస్సు..

## సీఎం చంద్రబాబు ముఖ్య ప్రసంగం



**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు(శనివారం) ఢిల్లీకి వెళ్లనున్నారు. దేశ రాజధానిలో జరిగే ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్-2026' సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సులో సీఎం చంద్రబాబు ప్రసంగించనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి టూర్ షెడ్యూల్ ఖరారైంది. శనివారం ఉదయం 10:50గంటలకు చంద్రబాబు నాయుడు ఢిల్లీ బయలుదేరుతారు.ఢిల్లీకి చేరుకున్న అనంతరం మధ్యాహ్నం 2గంటలకు ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో రైసినా డైలాగ్-2026 సదస్సులో పాల్గొంటారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ- అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైసినా డైలాగ్ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు ఫిన్లాండ్ దేశాధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ సహా 110 దేశాలకు చెందిన 2,700మంది ప్రతినిధులు హాజరవుతు న్నారు. 'జియో పాలిటిక్స్- జియో ఎకనా మిక్స్' అంశం ఆధారంగా చర్చలు సాగను న్నాయి.

ఈ సదస్సులో 'సాంకేతికత- సుపరిపాలన- భవిష్యత్' అనే అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఉపన్యాసం చేయను

2 లో



### నాడు ఆపరేషన్ సిందూర్‌లో వీరోచిత పోరు..

## నేడు ఫైటర్ జెట్ ప్రమాదంలో మృతి..

**న్యూఢిల్లీ, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** అస్సాంలోని కర్బీ ఆంగ్లాంగ్‌లో భారత వైమానిక దళానికి చెందిన సుఖోయ్ ఫైటర్ జెట్ కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోగా.. వారిలో ఒకరైన ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్ దురాగ్కర్ ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లుగా సమాచారం. ఈ విషయాన్ని పూర్వేష్ తల్లిదండ్రులు మీడియాకు తెలిపారు. పూర్వేష్(28).. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నట్లు అతని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ముందుగా ఈ విషయం తమకు తెలియదని.. ఆపరేషన్ సిందూర్ ముగిసిన 15 రోజుల తరువాత తెలిసిందని పూర్వేష్ తండ్రి రవీంద్ర దురాగ్కర్ తెలిపారు. యుద్ధ సమయంలో పూర్వేష్ వద్ద ఫోన్ లేదని.. యుద్ధం ముగిసిన తరువాత పూర్వేష్ తమకు కాల్ చేసి విషయం చెప్పాడని రవీంద్ర తెలిపారు.

అస్సాంలో ప్రమాదం జరగడానికి ఒక రోజు ముందు తన కొడుకుతో మాట్లాడినట్లు రవీంద్ర తెలిపారు. ఇంతలోనే ఇలా జరిగిందంటూ కన్నీరుమున్నీరయ్యారు. తన కొడుకు భారత వైమానిక దళంలో భాగమైనందుకు చాలా గర్వంగా ఉందన్నారు. పూర్వేష్ ఎప్పుడు మాట్లాడినా యుద్ధ విమానాలను నడిపిన తన అనుభవాన్ని, ఐఏఎఫ్ జెట్‌ల

2 లో

## హృదయపూర్వక అభినందనలు చిట్టితల్లులు




**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** తిరుపతి జిల్లాలోని వెంకటగిరి జెడ్పీ హైస్కూల్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థినుల నిజాయితీని కొనియాడారు మంత్రి నారా లోకేశ్. చిన్న వయస్సులోనే విద్యార్థినిల నీతివంతమైన ప్రవర్తన ఆదర్శనీయమని ప్రశంసించారు. విద్యార్థినిల నిజాయితీ విద్యాశాఖ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసిందన్నారు. 'నిజాయితీలో మా పిల్లలు బంగారం' అని మంత్రి లోకేశ్ అన్నారు. తిరుపతి జిల్లా వెంకటగిరి

2 లో

## 13ఏళ్లలోపు వారికి సోషల్ మీడియా బ్యాన్‌పై సీఎం కీలక ప్రకటన

ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజారోగ్యాన్ని సంరక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైట్ కాలర్ క్రైమ్స్, డిజిటల్ క్రైమ్స్, సైకోలు సోషల్ మీడియాలో అరాచకం చేస్తున్నారని.. మహిళలపై నేరాలకు పాల్పడితే వారికి అదే చివరి రోజు అవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు.

ఇలాంటి నాయకుడు ఎక్కడైనా ఉంటారా..

మావోయిస్టులను కట్టడి చేశామని.. ఫ్యాక్షనిజాన్ని రూపుమాపామని తద్వారా ప్రగతి సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇప్పుడు కొత్తగా రప్పా రప్పా రాజకీయం వచ్చిందని.. 'పెళ్లికి వెళ్తే కూడా రప్పా రప్పా అంటూ దాడులు చేయాలా? భద్రతకు వెళ్లిన ఎస్ఐ గాయపడేలా పర్యటనలు ఉంటాయా? గంజాయి, డ్రగ్స్, బ్లేడ్ బ్యాచ్‌లను పక్కన పెట్టుకునే నాయకుడు ఎక్కడైనా ఉంటారా? కటౌట్లకు పొట్టేళ్లతో రక్తాభిషేకం చేయటం ఏమిటి? ఇంత నేరుగా హింసను ప్రోత్సహిస్తారా?' అంటూ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇలాంటి హెచ్చరికలు ఏంటి...

పోస్టు మార్టానికి కారకులైన వారు పోస్టు మార్టానికే వెళ్తారని ముఖ్యమంత్రి హెచ్చరించారు. 'రాష్ట్రంలో ఈ విధ్వంస యాత్రలు ఏమిటి.. టైర్ల కింద మనుషుల్ని తొక్కించి నింద ప్రభుత్వంపై వేస్తారు. పరామర్శలకు వెళ్లి బలప్రదర్శనలు చేయటం ఏమిటి. 5 కిలోమీటర్లను 6-7 గంటల ప్రయాణం ఎవరైనా చేస్తారా? ప్రతిపక్షంలో ఉండి పెట్టుబడులు రాకుండా ఇష్టానుసారం మాట్లాడతారా? మేం అధికారంలోకి వస్తే పెట్టుబడులు రద్దు చేస్తామంటూ హెచ్చరికలు చేయటం ఏమిటి? దేశంలో ఏ రాజకీయ పార్టీ ఈ విధంగా వ్యవహరించలేదు' అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు చేశారు.

క్షమాపణలు చెప్పరా...

శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేశారని సీఎం విమర్శించారు. తెలియకుండా జరిగిన నేరంకాదని.. కుట్రతోనే కావాలని చేసిన నేరం ఇది అని అన్నారు. ఏడు కొండలను రెండు కొండలు చేసినప్పటి నుంచే ఈ కుట్ర కొనసాగుతోందని వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ ఇచ్చిన నివేదికలో కూడా 'అది కల్తీ నెయ్యి' అని స్పష్టంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా హిందూ మఠాలు, పీఠాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినా కనీసం ఆ పార్టీ క్షమాపణ చెప్పలేదని సీఎం అన్నారు. ప్రభువా క్షమించు అంటూ సాక్షి పత్రికలో పెద్ద ఎత్తున వార్తలు రాయించుకున్న వ్యక్తి నైవేద్యం కల్తీ చేసి క్షమాపణలు చెప్పరా అని నిలదీశారు. మత సామరస్యాన్ని గౌరవిస్తూ క్షమాపణ చెప్పకుండా దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనమండలిలోనూ ఇదే అంశంపై గొడవ చేసి హిందువుల మనోభావాలు దెబ్బతీస్తారా అంటూ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

## బొత్సకు మరోసారి అస్వస్థత

చంద్రశేఖర్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బొత్స సత్యనారాయణ హైబీపీతో ఇబ్బంది పడుతున్నారని, బీపీ కంట్రోల్‌లోకి రాకపోతే హాస్పిటల్‌కు వెళ్లాల్సి ఉంటుందని వైద్యులు సూచించారు. దీంతో బొత్సను సహచరులు ఆయన నివాసానికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బొత్స సత్యనారాయణ ఆరోగ్యం నిలకడగానే ఉందని సమాచారం.

## నాడు ఆపరేషన్ సిందూర్‌లో వీరోచిత పోరు.. నేడు ఫైటర్ జెట్ ప్రమాదంలో మృతి..

వేగం గురించి ఎంతో ఆసక్తిగా చెబుతుండేవాడని.. తన సహోద్యోగులను ఎంతో గౌరవించేవాడని రవీంద్ర తెలిపారు. 'నా కొడుకు దేశ సేవలో తనను తాను త్యాగం చేసుకున్నాడు. పూర్వేష్ తన కలను నెరవేర్చుకున్నాడు. కానీ, తను కోరుకున్నంతగా దేశానికి సేవ చేయలేకపోయాడు. కేవలం 4 సంవత్సరాలు మాత్రమే పని చేశాడు. పది రోజుల క్రితం మా ఇంటికి వచ్చాడు. తిరిగి విధుల్లోకి చేరిన తరువాత ఇలా జరిగింది.' అంటూ రవీంద్ర విలపించారు.

ప్రమాదం ఎలా జరిగింది..?

ఫ్లైట్ లెఫ్టినెంట్ పూర్వేష్, స్క్వాడ్రన్ లీడర్ అనుజ్ సాఖ-30 వీఖ×లో శిక్షణా మిషన్‌లో ఉన్నారు. జోర్హాట్ వైమానిక స్థావరం నుండి వీరి జెట్ టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కనిపించకుండా పోయింది. సాయంత్రం 7:42 గంటలకు సుఖోయ్‌తో కమ్యూనికేషన్ కోల్పోయినట్లు తెలిపిన అధికారులు.. జోర్హాట్ వైమానిక స్థావరం నుంచి 60 కిలోమీటర్ల దూరంలో కూలిపోయినట్లు గుర్తించారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు.

ఆపరేషన్ సిందూర్..

పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా(ామ)లో భాగమైన రెసిస్టెన్స్ ఫ్రంట్.. గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రదాడికి తెగపడిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతిస్పందనగా భారతదేశం మే 7వ తేదీన ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. భారత భద్రతా దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్(పీఓకే)లో ఉగ్రవాద శిబిరాలపై దాడి చేశాయి. ఈ దాడుల్లో 100మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఆ తరువాత పాకిస్థాన్.. భారత్‌పై క్షిపణులు, డ్రోన్‌లతో దాడులకు తెగబడగా.. భారత రక్షణ దళాలు సమర్థంగా అడ్డుకున్నాయి. ప్రతిదాడులతో పాక్‌ను షేక్ చేశాయి. మే 10వ తేదీన ఇరు దేశాలూ కాల్పుల విరమణ ప్రకటించాయి. దాంతో ఆపరేషన్ సిందూర్ నిలిచిపోయింది.

## రైసినా డైలాగ్-2026 సదస్సు.. సీఎం చంద్రబాబు ముఖ్య ప్రసంగం

న్నారు. రియల్ టైమ్ గవర్నెన్స్, డేటా ఆధారిత విధాన నిర్ణయాలు, డిజిటల్ పౌర సేవలు వంటి అంశాలను వివరించనున్నారు. అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ డెస్టినేషన్‌గా ఏపీని తీర్చిదిద్దేందుకు అనుసరిస్తున్న నిర్ణయాలను వారికి తెలపనున్నారు సీఎం చంద్రబాబు.

# అభివృద్ధికోసం కలసి ముందుకెళ్దాం

2014లో అలయన్స్ కోసం కష్టపడ్డానని తెలిపారు. 2019లో అది సాధ్యం కాలేదని.. 2024లో మరోసారి వెనక్కు తగ్గి పొత్తు పెట్టుకున్నానని ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలంటే మనలో ఏదైనా చిన్నచిన్న సమస్యలున్నా సర్దుకోవాలని దిశానిర్దేశం చేశారు. రాజ్యాంగంలోని మూడు వ్యవస్థలు పరస్పర సహకారంతో పని చేయాలని తెలిపారు. ఏ వ్యవస్థలో లోపాలు ఏర్పడినా ప్రజలకు సేవ చేయటంలో ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ ఈరోజు(శుక్రవారం) అసెంబ్లీలో మాట్లాడారు.

నిధులను పారదర్శకంగా ఖర్చు చేశాం..

జగన్ అండ్ కో కుట్రలను ఎదుర్కోవాలంటే మనం కలిసి ఉండాలని పవన్ కల్యాణ్ సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ నిధులను పారదర్శకంగా ఖర్చు చేశామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు ఎవరొచ్చినా వారు అడిగింది ఇవ్వటానికి తాను ప్రయత్నించానని పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా తన శాఖల తరపున ఇచ్చిన నిధుల వివరాలు అందజేస్తున్నానని తెలిపారు. బడ్జెట్ వస్తుందంటే ప్రతి ఒక్కరూ ఎన్నో ఆశలుపెట్టుకుంటారని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. 15సంవత్సరాలు ఏపీ కోసం కూటమి పని చేస్తుందని వ్యాఖ్యానించారు. కూటమి బలంగా ఉండాలని ప్రజలు కూడా కోరుకుంటున్నారని అన్నారు. మంత్రులు కందుల దుర్గేశ్, నాదెండ్ల మనోహర్ తమ శాఖల్లో బాగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. పర్యాటక రంగంలో రూ.20వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వివరించారు. ధాన్యం రైతులకు 24గంటల్లో డబ్బులు జతచేశామని వెల్లడించారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం..

మూడువేల గ్రామాల్లో తాగునీటి సమస్య గుర్తించామని... అక్కడ తొలి ప్రాధాన్యంగా నీరు ఇస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఏపీవ్యాప్తంగా 48వేల జనావాసాల్లో సురక్షిత తాగునీరు ఇవ్వాలనేది తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. 2019 నుంచి 2024 మధ్య ఉపాధి హామీ పథకంలో రూ.610కోట్లు రోడ్ల కోసం ఖర్చు చేశారని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.3,853కోట్లు రోడ్ల కోసం ఖర్చు చేశామని తెలిపారు. ఐదేళ్లలో 880 కిలోమీటర్లు సీసీ రోడ్లు వేస్తే మనం 6వేల కిలోమీటర్లు వేశామని వెల్లడించారు. వైసీపీ హయాంలో అన్ని రోడ్లు 8,500కిలోమీటర్లు వేస్తే... మనం రెండేళ్లలో 17,500 కిలోమీటర్ల రోడ్లు వేశామని తెలిపారు. చిట్టచివర్లో ఉన్న ప్రజానీకానికి కూడా ప్రభుత్వ ఫలాలు అందాలనే లక్ష్యంతో తాము పనిచేశామని పేర్కొన్నారు.

సీఎం చంద్రబాబుకు అభినందనలు.. ఇన్ని కష్టాలు, నష్టాలున్నా 11.75 ఆర్థిక వృద్ధిరేటు చూపించిన సీఎం చంద్రబాబుకు అభినందనలు. కోటి 11లక్షల సివిల్ కేసులు, 3కోట్లకు పైగా క్రిమినల్ కేసులు దేశవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయని ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ చెప్పారని అన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని గవర్నర్ సూచించారన్నారు. మన వద్ద ఉన్న కోర్టుల సంఖ్య, సిబ్బంది సంఖ్య ప్రకారం ఈ కేసులు ఎప్పటికీ పరిష్కారమవుతాయో చెప్పలేమని అన్నారు. చాలా కోర్టుల్లో కనీస సౌకర్యాలు లేవని.. మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు లేవని... న్యాయశాఖకు సరిపడా నిధులు బడ్జెట్‌లో కేటాయించాలని కోరుతున్నామని పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో 100 కోర్టు గదులకు నిధులు కేటాయించటం సంతోషమని చెప్పుకొచ్చారు. ఎవరిపైన కేసు నమోదైనా అది వ్యక్తిగతం కాదని.. వారి కుటుంబం పైనా ప్రభావం చూపిస్తుందని తెలిపారు. వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని గవర్నర్ సూచించారని అన్నారు. కోర్టుల్లో మౌలిక సౌకర్యాలు, సాంకేతిక వ్యవస్థ ఏర్పాటు చేయటం అత్యవసరమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## హృదయపూర్వక అభినందనలు చిట్టితల్లులు: మంత్రి లోకేశ్

జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థినిలు తమ నిజాయితీతో ఆదర్శంగా నిలిచారు. నిన్న(గురువారం) సాయంత్రం స్కూలు ముగిసిన తర్వాత వెంకటగిరి ఎస్‌బీఐ బ్యాంకు వద్ద మన్నవరం బస్సు కోసం ఎదురుచూస్తున్న సమయంలో విద్యార్థినిలకు ఒక పర్సు కనిపించింది. ఆ పర్సులో బంగారు నగలు, నగదు ఉన్నాయి. ఎటువంటి ఆలోచన లేకుండా 8వ తరగతి విద్యార్థినిలు బి. గురుప్రియ, బి. గీతిక, ఎం. గీతిక, 6వ తరగతి చదువుతున్న పద్మశ్రీ, 7వ తరగతి విద్యార్థిని హేమలతలు వెంటనే పర్సును తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ స్వరూపకు అందజేశారు. పోలీసుల నుంచి అభినందనలు అందుకున్న తర్వాత విద్యార్థినిలు బస్ స్టాప్ వద్దకు వచ్చారు. అక్కడ ఓ మహిళ ఆ పర్సు వెతుకుతూ పిల్లలను అడిగింది. విద్యార్థినిలు తమకే దొరికిందని.. పోలీస్ స్టేషన్‌లో ఇచ్చేశామని చెప్పి ఆమెతో పాటు మళ్లీ స్టేషన్‌కు వెళ్లారు. ఎస్ఐ ఆ మహిళ వివరాలు తెలుసుకుని... పర్సులోని నగలు, నగదు ఆమెవేనని నిర్ధారించుకుని అందజేశారు. మంత్రి స్పందన... ఈ సంఘటనపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ.. 'నిజాయితీలో మా పిల్లలు బంగారం' అని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నిజాయితీ, నైతిక విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని పేర్కొన్నారు. 'చిన్న వయసులోనే మీ నీతివంతమైన ప్రవర్తన ఆదర్శంగా నిలిచింది చెల్లెమ్మలూ. మీకు ఎల్లప్పుడూ అండగా ఉండే అన్నగా నేను గర్విస్తున్నాను. మీ నిజాయితీ మన విద్యాశాఖ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసింది. హృదయపూర్వక అభినందనలు చిట్టితల్లులూ' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

## తిరువూరులో హైటెన్షన్..144 సెక్షన్ విధింపు!




క్రైమ్ కౌంటర్ న్యూస్): తిరువూరు: ఎన్టీఆర్ జిల్లాతిరువూరు నియోజకవర్గంలో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న రాజకీయ ఉత్కంఠగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరువూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై టీడీపీ, విపక్ష వైసీపీ నేతలు బహిరంగ చర్చకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలోనే ఇరు వర్గాల కీలక నేతలు 'బోసు బొమ్మ' సెంటర్‌లో చర్చకు వెళ్తున్న విషయం తెలుసుకొని పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అనంతరం ఇరు వర్గాలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోస్ బొమ్మ సెంటర్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు. గత రెండు రోజులుగా తిరువూరు పట్టణంలో టీడీపీ-వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. నేతలు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకుంటున్నారు. ఇరు వర్గాల నేతలకు స్థానిక తహశీల్దార్ నచ్చజెప్పాలని చూసినా వినకపోవడంతో తిరువూరు మండల వ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. ప్రజలు గుంపులుగా ఉన్నా, ఉద్రిక్తతలకు కారణమయ్యే ర్యాలీలు, సభలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ప్రతిపక్షం తన బాధ్యతను పూర్తిగా విస్మరించింది: మంత్రి పయ్యావుల కేశవ్

అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్): ఏపీ శాసనసభలో ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ప్రసంగించారు. సభ్యులంతా బడ్జెట్ డిమాండ్లపై ఉత్సాహంగా చర్చలో పాల్గొన్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా వివిధ శాఖల డిమాండ్లపై మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా చర్చలో మాట్లాడినట్లు రికార్డుల్లో లేదని మంత్రి పేర్కొన్నారు. చంద్రబాబును చూసి నేర్చుకోవచ్చని మంత్రి అన్నారు. సభలో ప్రతిపక్షం లేకపోవడం బాధాకరంగా ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రతిపక్షంలో ఉన్నవారు ఎవరైనా ద్రవ్య వినిమయ బిల్లు చర్చలో పాల్గొనడానికి ఎదురుచూసేవారని చెప్పారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడే అవకాశం కోసం గట్టిగా ప్రయత్నించేవాళ్లమని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఉన్న పార్టీ తన బాధ్యతను పూర్తిగా విస్మరించిందని మంత్రి విమర్శించారు. బడ్జెట్ భాషను సరళీకృతం చేశామని, ఏప్రిల్ 1 నుంచి ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయికి సభ అనుమతి తీసుకుంటున్నట్లు తెలిపారు. 2023-24లో మూలధన వ్యయం రూ.24 వేల కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ.53,915 కోట్లకు పెంచామని వివరించారు. మూలధన వ్యయం పెరగడం వల్ల మౌలిక వసతులు మెరుగుపడి వేగంగా అభివృద్ధి జరుగుతుందని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి చెప్పే సంపద సృష్టి జరగాలంటే మూలధన వ్యయం పెంచాల్సిన అవసరం ఉందన్నారు మంత్రి. సాగునీటి ప్రాజెక్టులు, పోర్టులు, రోడ్ల నిర్మాణం ద్వారా ఆర్థిక కార్యకలాపాలు జరిగి సంపద వృద్ధి చెందుతుందని వివరించారు.

పాలన అంటే బటన్లు నొక్కడం కాదని.. ప్రజలకు తమ కాళ్ల మీద నిలబడే శక్తిని అందించడమని మంత్రి చెప్పారు. చేపలు పెట్టడం కాదు.. పట్టాలన్న కార్ల్ మార్క్స్ చెప్పిన మాటల్ని చంద్రబాబు పదేపదే చెబుతారని.. ఈ ప్రభుత్వం అదే విధంగా పనిచేస్తోందని తెలిపారు. సంక్షేమాన్ని విస్మరించలేదని.. సంక్షేమాన్ని ప్రారంభించిన ఎన్టీఆర్ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి



స్పష్టం చేశారు. సామాజిక భద్రతా పెన్షన్లు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఉచిత బస్సు సౌకర్యాన్ని మహిళలు బాగా ఉపయోగించుకుంటున్నారని.. పథకాల ద్వారా మహిళల సంతోష స్థాయిని పెంచామని తెలిపారు. తాము ఇచ్చిన పథకాలన్నీ కుటుంబ బడ్జెట్‌కు చేదోడుగా నిలుస్తున్నాయని మంత్రి వివరించారు.

ప్రాంతీయ అసమానతలకు తావు లేకుండా బడ్జెట్ రూపొందించామని మంత్రి పయ్యావుల వెల్లడించారు. రాయలసీమ ప్రాజెక్టులు ఆపామని వైసీపీ చెప్పడం అబద్ధమని మంత్రి ఖండించారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్జీటీ ఆదేశాలతో రాయలసీమ ఎత్తిపోతలు ఆపేశారని, అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే కనీసం దానివైపు చూడని వ్యక్తి జగన్ అని విమర్శించారు. అధికారం కోసం ప్రతిసారీ పెత్తందార్లు రాయలసీమ పేరుతో మాట్లాడతారని మండిపడ్డారు. ఎన్టీఆర్ మాత్రమే రాయలసీమ గురించి చిత్తశుద్ధితో పనిచేస్తే.. చంద్రబాబు దాన్ని కొనసాగించారని తెలిపారు. మంచి చేసినప్పుడు చెప్పడంతో పాటు.. అవతలి వారి తప్పులు కూడా చెప్పాలన్నారు. రాజకీయ నిరుద్యోగులంతా ఒక చోట చేరి.. రాయలసీమ గురించి ప్రేమ ఒలకబోస్తున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు.

క్రైమ్ కౌంటర్
గుంటూరు

# మహిళా లోకానికి స్ఫూర్తి... సులోచన రాణి పై స్పెషల్ స్టోరీ!




**పర్చూరు: క్రైమ్ కౌంటర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సతీష్** లక్ష్యం ఉంటే సాధన సాధ్యమేనని నిరూపించిన మహిళల్లో ఇంకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో సులోచన రాణి ఒకరు. పట్టుదలతో చదివి, క్రమశిక్షణతో ఉద్యోగ జీవితం సాగిస్తూ మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆమె కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవడం ఎంతోమంది బాలికలకు ప్రేరణగా మారింది.ఎంసెట్ ద్వారా అగ్రికల్చర్ యూనివర్సిటీలో హోమ్ సైన్స్ కోర్సును పూర్తి చేసిన ఆమె, అనంతరం ఏపీపీఎస్సీ ద్వారా అంగన్వాడీ శాఖలో ఈవోగా ఉద్యోగంలో చేరారు. విధుల్లో నిబద్ధతతో పనిచేస్తూ అనుభవాన్ని సంపాదించి, క్రమంగా ప్రమోషన్‌తో సీడీపీవోగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇంకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ, మహిళలు––శిశువుల సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమె తన ప్రయాణాన్ని పంచుకుంటూ, పట్టుదలతో చదివితే మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలరని తెలిపారు. విద్య మూడో నేత్రంలాంటిదని, అది మనిషికి దారితీసే శక్తి అని అన్నారు. బాలికలు విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, మంచి అలవాట్లు అలవరుచుకుని చదువును ఆయుధంగా మలుచుకుంటే జీవితంలో పెద్ద లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు.

నేటి ఆధునిక సాంకేతిక ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడానికి విద్య ఎంతో అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా అనేక మంది మహిళలు ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత పదవుల్లో పనిచేస్తున్నారని, వారి విజయాల వెనుక విద్యే ప్రధాన కారణమని చెప్పారు. సమాజంలో మహిళల స్థానం మరింత బలపడాలంటే చదువు, ఆత్మవిశ్వాసం అవసరమని వివరించారు.తల్లిదండ్రులు కూడా ఆడపిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆమె కోరారు. ఆడపిల్లలకు సరైన అవకాశాలు కల్పిస్తే వారు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి కూడా సేవ చేసే స్థాయికి ఎదుగుతారని తెలిపారు. మహిళలు స్వయం సమృద్ధిగా ఎదిగితేనే సమాజ అభివృద్ధి సాధ్యమని సులోచన రాణి పేర్కొన్నారు.అంగన్వాడీ వ్యవస్థ ద్వారా మహిళలు, బాలల సంక్షేమానికి సేవ చేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఆమె తెలిపారు. భవిష్యత్తులో కూడా మహిళల అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని సులోచన రాణి చెప్పారు.

# వైసీపీకి ప్రతిపక్ష హోదా ఎవరో ఇచ్చేది కాదు: సీఎం చంద్రబాబు

**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** వైసీపీకి ప్రతిపక్షహోదాపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా ఎవరో ఇచ్చేది కాదని... ప్రజలు ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రతిపక్ష హోదాకు తగ్గట్లుగా సీట్లు జగన్ పార్టీకి ప్రజలు ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. కానీ బాధ్యత లేకుండా వైసీపీ సభ్యులు తమ ప్రభుత్వం గురించి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ద్రవ్య వినిమయ బిల్లుపై సీఎం చంద్రబాబు ఇవాళ(శుక్రవారం) అసెంబ్లీలో మాట్లాడారు.

రెండు ప్రభుత్వాలు పూర్తి సఖ్యతతో పనిచేస్తున్నాయి..

ఏపీ కూటమిలోని మూడు పార్టీల్లోనూ చాలామంది కొత్త సభ్యులు వచ్చారని సీఎం చంద్రబాబు తెలిపారు. అప్పటి ప్రభుత్వంపై పోరాడిన వారిలో చాలామందికి సీట్లు ఇచ్చామని ప్రస్తావించారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో నిలబెట్టిన అభ్యర్థుల్లో 94శాతం మందిని గెలిపించారంటే.. అది తమపై ప్రజలకు ఉన్న నమ్మకమని ఉద్ఘాటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సఖ్యతతో పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. ఈ రాష్ట్రాన్ని గట్టెక్కించే బాధ్యత భుజస్కందాలపై పెట్టుకుని తాము ముందుకెళ్తున్నామని వ్యాఖ్యానించారు. తాను నాలుగుసార్లు సీఎంగా పనిచేశానని.. ఇలాంటి అస్తవ్యస్థమైన వారసత్వ ఆర్థిక వ్యవస్థ ఎప్పుడు రాలేదని చెప్పుకొచ్చారు. ఈసారి రూ. 3.32లక్షల కోట్ల ప్రోగ్రెసివ్ బడ్జెట్ పెట్టామన్నారు. మూడు పార్టీల నేతలతో కలిసి సమన్వయంతో ముందకెళ్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

భావితరాల భవిష్యత్ నిర్ణయించేలా చర్చలు..

గడచిన 15 రోజులుగా శాసనసభలో ఐదు కోట్లమంది ప్రజల భవిష్యత్తు గురించి చర్చలు జరిగాయని సీఎం చంద్రబాబు తెలిపారు. 'భావితరాల భవిష్యత్ నిర్ణయించేలా ఈ సమావేశాల్లో చర్చలు, నిర్ణయాలు జరిగాయి. విపక్ష పార్టీ సభకు హాజరు కాకుండా ప్రజా సమస్యలను వదిలేసినా.. ఐదుకోట్ల మంది ప్రజల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే ఇక్కడ చర్చించాం. విభజన వల్ల, గత పాలకుల విధ్వంసం వల్ల నష్టపోయిన ఏపీని పున:నిర్మాణం చేసుకుంటున్నాం. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో కీలకమైన నిర్ణయాలు తీసుకుని ప్రజలకు మేలు చేస్తున్నాం. గత ఎన్నికల్లో నిలబెట్టిన అభ్యర్థుల్లో 94 శాతం మంది గెలవటం మా అందరిపైనా ప్రజల్లో ఉన్న నమ్మకానికి నిదర్శనం. ఎన్డీఏ పక్షాలు పూర్తి సఖ్యతతో ప్రజలకు అవసరమైన నిర్ణయాలు తీసుకుంటున్నాయి. జగన్ హయాంలో ఏపీ తీవ్ర అగమ్య గోచరంగా మారిపోయింది. గత పాలకులు ప్రభుత్వ ఆస్తులను కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారు. వైసీపీ హయాంలో ఎమ్మార్వో ఆఫీసు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సర్క్యూట్ హౌస్ లాంటి ఆస్తులు తాకట్టు పెట్టారు. 12,13 శాతాలకు వడ్డీలు తెచ్చి ప్రభుత్వ ఆర్థిక వనరులను దుర్వినియోగం చేశారు. రూ.43,298 కోట్ల విలువైన అప్పులు రీషెడ్యూల్ చేయించాం. తద్వారా రూ.328 కోట్ల మేర ఆదా అవుతుంది' అని సీఎం చంద్రబాబు వివరించారు.

పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేశారు..

మరో రూ. ఒక కోటి మేర అప్పులు కూడా రీషెడ్యూల్ చేసేలా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'రూ.1658 కోట్లు ఆర్థికంగా వెసులుబాటు వస్తుంది. ఈ నిధులతో మరో సంక్షేమ పథకం అమలు చేసే అవకాశం ఉంటుంది. పోలవరం ప్రాజెక్టును కూడా వచ్చే ఏడాది జూన్ నాటికి జాతికి అంకితం చేసేలా పనులు శరవేగంగా చేపట్టాం. ఓ వ్యక్తి తన స్వార్థంతో రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేశారు. గోదావరి పుష్కరాల కంటే ముందే ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేసి నీళ్లు ఇస్తాం.



ఎక్కడా లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకుంటాం. కేంద్రప్రభుత్వం సహకారంతో అమరావతి రాజధానిని ట్రాక్‌లో పెట్టాం. మూడేళ్లలో రాజధానికి ఓ రూపు వస్తుంది. వచ్చే సెషన్‌కు ఎమ్మెల్యేలు, మంత్రులు రాజధానిలోని వారి క్వార్టర్లలో ఉండేలా చర్యలు చేపడుతున్నాం. కేంద్రం నిధులతో విశాఖపట్నం ఉక్కును కాపాడుకున్నాం. తొలిసారి విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి వచ్చింది. స్టీల్ ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారాన్ని అందిస్తోంది. రాష్ట్రానికి నీటి భద్రత అనేది అత్యంత ముఖ్యమైన అంశం. గడచిన 20 నెలల్లో దీనికి అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. హంద్రీనీవాకు రూ.3850 కోట్లు మంజూరు చేసి కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లాం. అనంతపురం లాంటి జిల్లాలకు 55 టీఎంసీల నీటిని తీసుకెళ్లాం. ప్రస్తుతం వేసవి వచ్చినా 628 టీఎంసీల నీరు వివిధ రిజర్వాయర్లలో నిల్వ ఉంది. సమర్థ నీటి నిర్వహణతోనే ఇది సాధ్యమైంది. భూగర్భజలాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా గణనీయంగా పెరిగాయి. రాష్ట్రంలో 2.96 మీటర్ల మేర భూగర్భజలాలు పెరిగేలా వివిధ సంరక్షణా చర్యలు చేపట్టాం' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

కరెంటు ఛార్జీలు పెంచం..

భూగర్భజలాలు పెరగటం వల్ల వ్యవసాయ విద్యుత్ వినియోగం తగ్గిందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆ మేరకు వ్యయాన్ని ఆదా చేసుకున్నామని అన్నారు. 'ఎన్ని ఇబ్బందులు ఉన్నా కరెంటు ఛార్జీలు పెంచమని చెప్పాం, ఆ మాట నిలబెట్టుకున్నాం. గత పాలకులు 32 వేల కోట్ల కరెంటు ఛార్జీల భారం ప్రజలపై మోపారు. గత పాలనలో ట్రూ అప్ భారం వేస్తే మేం చరిత్రలో తొలిసారి ట్రూడౌన్ చేశాం. రూ.4,420 కోట్ల మేర ట్రూ అప్ భారాన్ని కూడా ప్రజలపై మోపకుండా చర్యలు తీసుకున్నాం. పీఎం సూర్యఘర్ ద్వారా ఎస్సీ, ఎస్టీ లకు ఉచితంగా సౌర ప్యానెళ్లు ఏర్పాటు చేసి ఇంటిపైనే విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు చేపట్టాం. ఈ ఏడాది ప్రతీ యూనిట్ కొనుగోలు ధరను రూ. 5.19 నుంచి 4.80లకు తగ్గించేలా చర్యలు చేపట్టాం. అగ్రిటెక్ అనేది ఓ విధానంగా మార్చుకుని వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. రూ.లక్ష కోట్లతో ఉమ్మడి ప్రకాశం జిల్లాతో సహా రాయలసీమ జిల్లాలను హార్టీ కల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తాం. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు ఇవ్వాలనే పది సూత్రాలతో 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపకల్పన చేశాం. పీ4 కార్యక్రమంలో భాగంగా ఎంబీకే 10-20 కింద మరో కార్యక్రమం చేపట్టాం. ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది. త్వరలోనే ప్రతీ కుటుంబానికి ఫ్యామిలి బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం కార్డును కూడా జారీ చేస్తాం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్నీ పథకాలను ఈ కార్డు ద్వారా ఇంటిగ్రేట్ చేస్తాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# గుంటూరులో డిస్నీ ల్యాండ్ ఏర్పాటుపై ఎమ్మెల్యే ప్రశ్న.. మంత్రి సమాధానం ఇదే

**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీ అసెంబ్లీ సమావేశాలు 15వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం ఉదయం ప్రశ్నోత్తరాలతో శాసనసభ ప్రారంభమైంది. గుంటూరు జిల్లాలోని వట్టిచెరుకూరు వద్ద డిస్నీల్యాండ్ ఏర్పాటుపై ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ప్రశ్న లేవనెత్తారు. డిస్నీ ల్యాండ్ ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన వినోద కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని.. వట్టిచెరుకూరులో జాతీయ రహదారి పక్కన అనువైన భూమి అందుబాటులో ఉందని అన్నారు. డిస్నీ ల్యాండ్ ఏర్పాటుకు అక్కడి రైతులు 500 ఎకరాల భూమిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకానికి ప్రాధాన్యం ఇస్తోందని, ఈ నేపథ్యంలో డిస్నీ ల్యాండ్ ఏర్పాటు కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరు ప్రవాస భారతీయులు కూడా దీనిపై ఆసక్తి చూపుతున్నారని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. ఈ ప్రశ్నకు మంత్రి కందుల దుర్గేశ్ సమాధానమిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం వండర్ లా, ఇమేజికా వంటి సంస్థలతో సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. వీరు తిరుపతిలో వినోద కేంద్రం ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారని వివరించారు. డిస్నీ ల్యాండ్ చాలా పెద్ద ప్రాజెక్ట్ అని.. దీనికి భారీగా ఖర్చు అవుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఒక్క కేంద్రం ఏర్పాటుకు 30 నుంచి 60 వేల కోట్ల రూపాయల వరకు ఖర్చు అవుతుందన్నారు. ప్రస్తుతం డిస్నీ ల్యాండ్ మెట్రో నగరాల్లో మాత్రమే ఉందన్నారు. ఇక్కడ అంత ఖర్చుతో ఏర్పాటు చేస్తే వయబులిటీ కాకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ఇక్కడి ప్రజలు అంత ఖర్చు పెట్టే స్థితిలో లేరని మంత్రి పేర్కొన్నారు. పీపీపీ విధానంలో ఇలాంటి ప్రాజెక్టులను ఏర్పాటు చేయవచ్చని మంత్రి వెల్లడించారు. పర్యాటక ప్రాజెక్టులకు ప్రభుత్వం రాయితీలు ఇస్తోందని.. పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించామని తెలిపారు. కొన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరిపిందన్నారు. భాగస్వామ్య సదస్సులో 18 వేల కోట్ల రూపాయల విలువైన పర్యాటక ప్రాజెక్టుల ఒప్పందాలు జరిగినట్లు మంత్రి కందుల దుర్గేశ్ వెల్లడించారు.

## 11 మంది ఉన్నా 1100 మంది లాగా మాట్లాడుతున్నారు.. వైసీపీపై పవన్ కల్యాణ్ సెటైర్లు



**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** వైసీపీకి 11మంది సభ్యులున్నా 11వందల మంది ఉన్నట్లుగా మాట్లాడుతారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు చెప్పే అసత్యాలు కూడా ప్రజలు నిజాలని బలంగా నమ్మే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఇతరుల స్వేచ్ఛను, హక్కులను హరించటం తమ హక్కని వైసీపీ భావిస్తోందని మండిపడ్డారు. ఇలాంటి అసభ్య పదజాలంతో మాట్లాడే వారిని కట్టడి చేయాలని కోరారు. దోపిడి చేసే దొంగ పోలీసులను చూసి.. దొంగే దొంగ అని అరిచినట్లుగా జగన్ అండ్ కో తీరు ఉందని సెటైర్లు గుప్పించారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు.

కల్తీ వాళ్లే చేస్తారు..

కల్తీ వాళ్లే చేస్తారని... నిందలు మాత్రం కూటమి ప్రభుత్వంపై మోపుతారని పవన్ కల్యాణ్ ఆగ్రహించారు. ఎవరు ఎమ్మెల్యేగా గెలవాలన్నా.. అన్ని కులాల వాళ్లు ఓట్లు వేయాల్సిందేనని తెలిపారు. ఈ మధ్య కొందరు ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటున్నారని ఫైర్ అయ్యారు. ఇష్టం వచ్చినట్లుగా తిట్టి కులం వెనుక దాక్కుంటే రాష్ట్రం నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కులం దాటకపోతే ఏపీ విచ్ఛిన్నమవుతుందని.. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా మనమే చెప్పాలని అన్నారు. లేకపోతే ఎంత బడ్జెట్ పెట్టినా ఉపయోగం ఉండదని చెప్పుకొచ్చారు. పోలవరం, అమరావతిని వైసీపీ పక్కన పెట్టిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు.

## వైసీపీ ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ 30 ఏళ్లు వెనక్కు.. పవన్ కల్యాణ్ ధ్వజం



**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** జగన్ హయాంలో ఆర్థిక విధ్వసం చేసి, ఏపీని గందరగోళంలోకి నెట్టివేశారని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఆర్థిక విధ్వంసం వల్ల ఏపీ 30ఏళ్లు వెనక్కు వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్రవ్యవినిమయ బిల్లుపై పవన్ కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడారు. మంత్రి పయ్యావుల కేశవ్ అసెబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా 3.32లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. సామాజిక భద్రత పెన్షన్ల కోసమే రూ.33వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించారు. ఇలాంటి పరిస్థితిని తట్టుకోవటం, పథకాలు ఇవ్వటానికి సీఎం చంద్రబాబుకు ఎంతో ధైర్యం ఉండాలని ప్రశంసించారు.

విద్యుత్ సంస్థలకు నష్టం..

ఈ సందర్భంగా 'నేను నాటిన చెట్ల ఫలాలు నా కోసం కాదని... భావితరాల కోసం' అన్న రవీంద్రనాథ్ ఠాగూర్ సూక్తులను పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. బడ్జెట్‌లో చంద్రబాబు దూరదృష్టి, దక్షత, దార్శనికత అడుగడుగునా ఉందని కొనియాడారు. వైసీపీ హయాంలో చేపట్టిన విద్యుత్ కొనుగోళ్ల కారణంగా డిస్కంలకు రూ.12,250కోట్ల నష్టం వచ్చిందని చెప్పుకొచ్చారు. కరెంట్ సరఫరాలో కూడా ఇబ్బందులు వచ్చాయని వివరించారు. రూ. 1.29 లక్షల కోట్లు విద్యుత్ సంస్థలు నష్టపోయాయని.. ఆ భారాన్ని ప్రజలపై మోపారని ఆగ్రహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ చార్జీలు రద్దు చేసి ట్రూడౌన్ పేరిట ఛార్జీలు తగ్గించామని ప్రస్తావించారు.

రూ.9లక్షల కోట్ల మేర అప్పులు..

వైసీపీ ప్రభుత్వం రూ.9లక్షల కోట్ల మేర అప్పులు తమపై ఉంచి వెళ్లిందని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. రూ.35వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టి వెళ్లారని.. అందులో రూ.25వేల కోట్లు చెల్లించామని స్పష్టం చేశారు. కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా రూ.7వేల కోట్లకు పైగా జత చేశామని వెల్లడించారు. గతంలో వైసీపీ రాష్ట్ర వాటా ఇవ్వకపోవటం వల్ల రూ.8,700 కోట్లు జలజీవన్ మిషన్ నిధులు నిరుపయోగమయ్యాయని చెప్పుకొచ్చారు. వైసీపీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన అనేక ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వంలో ప్రారంభించామని తెలిపారు. జలజీవన్ మిషన్‌కు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## మీకు రోజూ అలవాటుగా మారింది'.. వైసీపీ సభ్యులపై చైర్మన్ ఆగ్రహం



**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీ శాసనమండలి శుక్రవారం ఉదయం ప్రారంభమైంది. సభ మొదలైన వెంటనే గీతం యూనివర్సిటీ 5 వేల కోట్ల భూ దోపిడీపై చర్చించాలని వైసీపీ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తిరస్కరించారు. దీంతో సభలో వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. ప్లకార్డులతో పోడియం వద్ద నినాదాలు చేశారు. వైసీపీ ఎమ్మెల్సీల తీరుపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మీకు రోజూ అలవాటుగా మారింది' అంటూ ఫైర్ అయ్యారు. వాయిదా తీర్మానం ఆమోదం పొందదని తెలిసి ఎందుకు ఆందోళన చేస్తున్నారని చైర్మన్ ప్రశ్నించారు. వైసీపీ సభ్యుల ఆందోళనల మధ్యే చైర్మన్ ప్రశ్నోత్తరాలను ప్రారంభించారు. వైసీపీ ఎమ్మెల్సీ నిరసనతో సభలో గందరగోళం నెలకొనడంతో చైర్మన్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు.

## నంద్యాల జిల్లాలోని అడవిలో కార్చిచ్చు




**నంద్యాల జిల్లా, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** నంద్యాల జిల్లాలోని ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని పెచ్చెరువు సమీపంలో ఇవాళ(శుక్రవారం) అగ్నిప్రమాదం జరిగింది. అడవిలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అటవీ సంపద కళ్లముందే కాలిపోయింది. వేసవి కాలం కావడంతో ఎండిన ఆకులు, చెట్లు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించాయి. దీంతో విలువైన వృక్షసంపదకు ముప్పు వాటిల్లింది.సిబ్బంది వాహనాలు దగ్ధం..

అడవిలో చెలరేగిన కార్చిచ్చును అదుపు చేసేందుకు వెళ్లిన ప్రొటెక్షన్ వాచర్లకు చేదు అనుభవం ఎదురైంది. మంటల తీవ్రతకు వారు అక్కడ నిలిపి ఉంచిన మూడు మోటార్ బైక్‌లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అదృష్టవశాత్తూ సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. అయితే, ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పి, అటవీ ప్రదేశాన్ని రక్షించేందుకు కృషి చేస్తున్నారు. అధికారులు చేపట్టిన చర్యల ద్వారా మంటలు కొంత నియంత్రణలోకి వచ్చాయని సమాచారం. అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. ప్రకృతి ప్రసాదించిన అటవీ సంపదను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. ఈ ప్రమాదంపై అటవీ శాఖ అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు.

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆత్మీయ సమావేశం...హాజరుకానున్న సీఎం



**విజయవాడ, మార్చి 6, (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆత్మీయ సమావేశం ఈరోజు సాయంత్రం జరగనుందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ రోజు సాయంత్రం 6:00 గంటలకు విజయవాడ పటమట డొంక రోడ్డులోని ఆంత్రా లక్స్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరగనుందని... ఈ సమావేశానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమంలో ముందుగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం క్రీడల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేయనున్నారని మంత్రి వివరించారు. తరువాత ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర సభ్యులతో కలిసి విందులో పాల్గొననున్నారని చెప్పారు. సభ్యులందరూ సాయంత్రం 6:00 గంటలకు ముందుగానే సభా ప్రాంగణానికి చేరుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు.

# ఆహార కల్తీ నియంత్రణ కోసం చర్యలు: మంత్రి సత్యకుమార్

**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో ఆహార కల్తీ నివారణ చర్యలపై గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అసెంబ్లీలో ప్రశ్నించారు. ఆహారం ఔషధమని చెప్పారని... కానీ ఇప్పుడు ఆహారమే విషంగా మారుతోందని అన్నారు. బియ్యం నుంచి... దేవుడు ప్రసాదం వరకూ అన్ని కల్తీ అవుతున్నాయని చెప్పుకొచ్చారు. కల్తీకి పాల్పడే వారిపై కఠిన చర్యలు లేకపోవటం వల్ల విచ్చలవిడిగా కల్తీ జరుగుతోందని పేర్కొన్నారు. కల్తీ ఆహారం కారణంగా జీర్ణ, నాడీ వ్యవస్థ పాడైపోతున్నాయని, క్యాన్సర్ వంటి జబ్బులు వస్తున్నాయని వెల్లడించారు. ఆహార కల్తీ నియంత్రణపై గతంలో జీవో తెచ్చినా వైసీపీ హయాంలో సరిగా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. దీంతో కల్తీ నియంత్రణలో ఏపీ చివరి స్థాయికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిబ్బందిని పెంచి, ల్యాబ్‌లు ఏర్పాటు చేశామని ప్రస్తావించారు. కంటికి ఇంపుగా, నోటికి రుచిగా ఉంటే చాలదని.. కల్తీపై అవగాహన పెరగాలని సూచించారు.యూరియాతో పాలు తయారు చేస్తున్నారు: ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

అయితే, ఆహార కల్తీ నివారణ చర్యలపై ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కూడా ప్రశ్నించారు. పాల కల్తీ ఇటీవల పెరిగిందని.. యూరియాతో పాలు తయారు చేస్తున్నారని అన్నారు. అలాగే, జంతువుల కొవ్వుతో నెయ్యి తయారు చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ప్రమాదకర టేస్టింగ్ సాల్ట్‌ను ఏపీలో నిషేధించాలని డిమాండ్ చేశారు. పామాయిల్‌తో పాటు తక్కువ నాణ్యత ఉన్న నూనెలను హోటళ్లలో వాడుతున్నారని తెలిపారు. ఆహారంలో రంగుల వాడకాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆహార కల్తీపై ఎలాంటి నియంత్రణ లేదని.. జిల్లాకు కేవలం ఇద్దరే ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారని తెలిపారు. దీనివల్ల వారు తనిఖీలు విస్తృతంగా నిర్వహించలేని పరిస్థితి ఉందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఆహార కల్తీ నిర్ధారించే ప్రయోగశాలలు పెంచుతాం: మంత్రి సత్యకుమార్


ఆహార కల్తీపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఏపీ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సమాధానం ఇచ్చారు. ఏపీలో ఆహార కల్తీ నియంత్రణ కోసం



చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. 2023 నుంచి 2026 వరకూ 16వేల700 ఆహార నమూనాలు పరిశీలించామని వివరించారు. 14వందల నమూనాల్లో కల్తీ ఉన్నట్లు తేలిందన్నారు. బాధ్యులను కోర్టుల్లో పెట్టి జరిమానాలు, తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రజారోగ్యాన్ని వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆగ్రహించారు.

జగన్ హయాంలో ఆహార సిబ్బంది నియామకాలు సరిగా చేయలేదని, ల్యాబ్‌లు కూడా ఏర్పాటు చేయలేదని మంత్రి సత్యకుమార్ చెప్పుకొచ్చారు. సింథటిక్ రంగులు ఆహార పదార్థాల్లో వాడుతున్నారని తెలిపారు. దీనిపై గుంటూరు, రాజమహేంద్రవరంలో తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకున్నామని అన్నారు. సింథటిక్ రంగులు ఆహారాన్ని కల్తీ చేయటంతో పాటు ప్రజలకు అనారోగ్యాన్ని కలిగిస్తాయని చెప్పుకొచ్చారు. వీటిపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆహార కల్తీ నిర్ధారించే ప్రయోగశాలలు పెంచుతామని అన్నారు. కల్తీకి పాల్పడే వారికి ప్రస్తుత చట్టం ప్రకారం కేవలం ఆరు నెలలు మాత్రమే శిక్ష పడుతోందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసం దేవుడిని వాడుకోవడం సరికాదన్న రోజా



**మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీలోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం దేవుడిని, ఆలయాల ప్రతిష్ఠను వాడుకోవడం తగదని హితవు పలికారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వస్తున్న ఆరోపణలు అసత్యమని, భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు.రాజకీయం చేయడానికి వేరే అంశాలు లేకనే దేవుడిని, ఆలయాలను వివాదాల్లోకి లాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల, శ్రీశైలం, అన్నవరం వంటి ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల ప్రతిష్ఠను కూటమి నేతలు దిగజార్చుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, హోం మంత్రి వంటి ఉన్నత స్థానాల్లో ఉన్న వారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని హితవు పలికారు. శాసనమండలి చైర్మన్ స్థానంలో ఉన్న వ్యక్తి కులం, మతం గురించి మాట్లాడటం అత్యంత విచారకరమని వ్యాఖ్యానించారు.తిరుమల లడ్డూ వ్యవహారంలో తమ వైపు తప్పు లేదని ప్రభుత్వం భావిస్తే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని ఎద్దేవా చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు అసత్య ప్రచారాలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

# దేశవ్యాప్త కమాండో పోటీల్లో ఏపీ పోలీసుల జైత్రయాత్ర.. నాలుగు ప్రతిష్టాత్మక ట్రోఫీలు కైవసం


**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ పోలీసు విభాగంలోని ఎలైట్ ఫోర్సెస్ అయిన గ్రేహౌండ్స్, ఆక్టోపస్ కమాండో లు జాతీయ స్థాయిలో మరోసారి తమ సత్తా చాటుకున్నారు. హర్యానా రాష్ట్రం మనేసర్‌లోని చీూ+(నేషనల్ సెక్యూరిటీ గార్డ్) క్యాంపస్‌లో నిర్వహించిన 16వ ఆల్ ఇండియా పోలీస్ కమాండో పోటీల్లో ఏపీ బృందం అద్భుత ప్రదర్శన కనబరిచి, నాలుగు ప్రతిష్టాత్మక ట్రోఫీలతో పాటు పతకాలను సాధించింది. పోటీలన్నింటిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ఏపీ పోలీసు కమాండో దళానికి 'ఉత్తమ రాష్ట్ర పోలీసు కమాండో' ట్రోఫీ దక్కింది. దానితో పాటు షూటింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు గాను 'బ్లాక్ హాక్ ట్రోఫీ'. దేశంలో ఉత్తమ ఆపరేషనల్ లీడర్ షిప్ కనబరిచినందుకు గాను 'రణనీతి ట్రోఫీ'. ఓవరాల్ కమాండో పోటీల్లో అద్భుత ప్రదర్శనకు గాను కాంస్య పతకం సొంతం చేసుకున్నారు.

డీజీపీ అభినందనలు.. జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను పెంచిన కమాండోలను రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రత్యేకంగా అభినందించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బృందాల కోర శ్రమ, క్రమశిక్షణే ఈ




విజయానికి కారణం అని ఆయన కొనియాడారు. భవిష్యత్‌లో కూడా ఇదే తరహాలో నిబంద్ధతతో పనిచేసి దేశ రక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

# జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి తుది ఓటరు జాబితా సిద్ధం చేయాలి -జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా .



**క్రైమ్ కౌంటర్ : నరసరావుపేట** –రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి తుది ఓటర్ జాబితా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా సూచించారు. డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి

## వీడియో కాన్ఫరెన్స్ లో అధికారులతో కలెక్టర్.

అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం పోర్టల్ నందు అప్డేట్ చేయాలనీ ఆదేశించారు. శుక్రవారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల లాగిన్ల నందు ముందుగా 2011 జనాభాను నవెోదు చేయాలనీ,తదుపరి గ్రామపంచాయితీల వారీగా పోలింగ్ స్టేషన్ల జాబితా నమోదు చేయాలనీ, గ్రామపంచాయితీల వార్డుల వారీగా ప్రింట్ తీసుకోవాలని,డోర్ నంబర్లు తప్పుగా ఉన్న యెడల వారి యొక్క యధాస్థానానికి చేర్చాలని తదుపరి ఓటర్ల జాబితా వార్డుల వారీగా ప్రింట్ తీసుకుని గ్రామస్థాయిలో ప్రక్రియ పూర్తి చేసి పల్నాడు జిల్లాలో ఉన్న గ్రామపంచాయితీల నశీదు వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని తెలిపారు. ఈ మీటింగ్ నందు జిల్లా గ్రామపంచాయితీ అధికారి యస్.వి.నాగేశ్వర్ నాయక్, సత్తెనపల్లి, గురజాల,నరసరావు పేట డివిజనల్ అభివృద్ధి అధికారులు, డివిజనల్ పంచాయితీ అధికారి మరియు జిల్లాలోని డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

# క్రైం కౌంటర్ ప్రకాశం



## చింతల అగ్రహారం గ్రామ ప్రజలకు త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం



**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా...** జల్ జీవన్ మిషన్ (హర్ ఘర్ జల్) పథకం ద్వారా మార్కాపురం జిల్లాలోని ప్రకాశం పశ్చిమ ప్రాంతానికి ?1290 కోట్ల వ్యయంతో అమలు అవుతున్న త్రాగునీటి సరఫరా ప్రాజెక్ట్‌లో భాగంగా దోర్నాల మండలం, చింతల అగ్రహారం గ్రామంలో ?14 లక్షల వ్యయంతో నిర్మించబడనున్న ఓవర్ హెడ్ ట్యాంక్‌కు యర్రగొండపాలెం నియోజకవర్గం టిడిపి ఇంచార్జి శ్రీ గూడూరి ఎరిక్షన్ బాబు, శంకుస్థాపన చేశారు. అదేవిధంగా, ఇటీవల జరిగిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో చింతల అగ్రహారం ఎస్సీ పాలెం గ్రామస్తులు త్రాగునీటి సమస్యను వివరించి బోరు మంజూరు చేయాలని కోరగా, వెంటనే స్పందించిన శ్రీ గూడూరి ఎరిక్షన్ బాబు , ఆ ఎస్సీ పాలెంకు బోరు మంజూరు చేసి, ఈ రోజు బోరు ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల డెవలప్మెంట్ అధికారి , =ఔా ణజు , =ఔాాజు , దోర్నాల మండలం టిడిపి అధ్యక్షులు షేక్ మాబు , మండల సీనియర్ నాయకులు, చింతల అగ్రహారం గ్రామ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు....

## భాష్యం పాఠశాలలో ఘనంగా పట్టభద్రుల దినోత్సవ వేడుకలు




**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా.....** మార్కాపురం పట్టణంలోని భాష్యం పాఠశాలలో శుక్రవారం ఖఖ+ , ఐదవ తరగతి విద్యార్థుల పట్టభద్రుల దినోత్సవ వేడుకలు ప్రకాశం జోన్స్ జూా శ్రీ కృష్ణ గణేష్ ఆదేశాల మేరకు పాఠశాల ప్రిన్సిపల్ కేవీ.నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం మండల తహశీల్దార్ కే.చిరంజీవి పాల్గొని విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందచేశారు. గ్రాడ్యుయేషన్ దినోత్సవ వేడుకలతో విద్యార్థులలో చదువుపై మరింత ఆసక్తి కలుగుతుందని తహసీల్దార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రత్యేకంగా అలరించారు. కార్యక్రమంలో పాఠశాల లిటిల్ చాంప్స్ ఇంచార్జ్ హేమసుధ, పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.....



**క్రైమ్ కౌంటర్ న్యూస్....మార్కాపురం జిల్లా ....** మార్కాపురం పట్టణం సౌజన్య కళ్యాణ మండపం లో జరిగిన గ్రంథిసిల.వెంకట వరప్రసాద్ గుప్తా(గుప్తా ప్రసాద్ )వారి వివాహ వేడుకల్లో పాల్గొని వధువు వర్ష వరుడు సందీప్ లను నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే మార్కాపురం వైయస్సార్సీపీ ఇంచార్జి అన్న రాంబాబు ,ఏపీఐఐసీ మాజీ చైర్మన్ నెల్లూరు పార్లమెంట్ వైఎస్ఆర్ సీపీ పరిశీలకులు మార్కాపురం మాజీ ఎమ్మెల్యే శ్రీ జంకె.వెంకటరెడ్డి ...

## కంభం సచివాలయం 2 లో పునః ప్రారంభం అయిన ఆధార్ సెంటర్.





**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా....** కంభంలోని సచివాలయం 2 లో ఈరోజు నూతన ఆధార్ సెంటర్ ను కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య కంభం ఎంపీడీవో కంభం డిప్యూటీ ఎంపీడీవో దేవరశెట్టి బ్రహ్మయ్య లు పునః ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్నాటి బోడయ్య కంభం డిప్యూటీ ఎంపీడీవో దేవరశెట్టి బ్రహ్మయ్య కంభం ఎంపీడీవో వీరభద్రచారి మాట్లాడుతూ ప్రజలు ఆధార్ సెంటర్ సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయం 2 కార్యదర్శి షేక్ ఖాదర్ వలి, వీఆర్వో రమణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, ఫిషరీస్ డిపార్ట్మెంట్ డి.శారద, డిజిటల్ అసిస్టెంట్ పి.సురేష్, ప్రజలు పాల్గొన్నారు.....



**క్రైమ్ కౌంటర్ న్యూస్...ప్రకాశం జిల్లా..** ఈ రోజు ఒంగోలు పట్టణము లోని వారి స్వగృహము నందు శ్రీ వైవీ సుబ్బారెడ్డి ,ని మరద్య పూర్వకంగా కలసి సన్మానంనించడం జరిగింది...

అనంతరం ప్రస్తుత మార్కాపురం జిల్లా రాజకీయలు చర్చించడం జరిగింది...

ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైయస్సార్ సిపి నియోజకవర్గం ఇంచార్జి అన్న రాంబాబు , వైయస్ఆర్సీపీ స్టేట్ సెక్రటరీ, కొండేపి వైయస్సార్ సిపి నియోజకవర్గ పరిశీలకులు ఐతీ షంషీర్ అలీ బెగ్ , మార్కాపురం పురపాలక సంఘ చైర్మన్ బాల మురళి కృష్ణ , పాల్గొన్నారు...

## మోట్ల మల్లికార్జునపురం వద్ద కారు మోటర్ సైకిల్ డి ఒకరు మృతి.





**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా...** పెద్ద దోర్నాల మండలం, మోట్ల మల్లికార్జునపురం సమీపంలో మోటార్ సైకి ను కారు ఢీకొనడంతో మోటార్ సైకిల్ పై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికి అక్కడే మృతి చెందాడు.ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఘటనడోన్ సమీపంలోని రాచర్ల గ్రామానికి చెందిన బెస్త శరత్ (25) అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో పాటు ఉన్న నూనె దేవేంద్ర స్వల్ప గాయాలతోబయటపడ్డాడు.మాచర్ల నుండి డోన్ లోజరిగే రంగనాథ స్వామి జాతరకు వెళ్తుండగా ఈ ప్రమాదంజరిగినట్లుసమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న పెద్ద దోర్నాల ఎస్సై ఎస్.వి.వెంకట రమణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్నిపోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.....

## పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికునిలా పని చేయాలి!

### వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్

**క్రైం కౌంటర్ ప్రతినిధి టి.నాగ బ్రహ్మం మాజీ శాసనసభ్యులు కందుకూరు రూరల్,** నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ పార్టీ కార్యాలయంలో వలేటివారి పాలెం మండల లోని ,అమ్మపాలెం ,శాకవరం , నేకునాంపురం ,కాకూటూరు,వలేటివారిపాలెం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి గ్రామస్థాయి కమిటీల సమావేశము శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ పార్టీని బలంగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి ఐకమత్యంగా పనిచేద్దాశీ అని పేర్కొన్నారు.పార్టీ కష్ట కాలంలో పార్టీ జెండాను భుజాన వేసుకొని మోసే వాళ్లను గుర్తు ఉంచుకొని పనిచేద్దాం అని తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ విస్తృతస్థాయి వ్యవస్థాపనకు నాంది పలుకుదాం అని చెప్పారు.పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన వారికి పార్టీ పరంగా ఎల్లవేళలా అండగా నిలుస్తాం తెలిపారు.

నాయకుల మధ్య ఎటువంటి అభిప్రాయ భేదాలకు తావు లేకుండా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కలిసి పని చేయాలనీ వివరించారు.

జగన్ అన్న ను తిరిగి ముఖ్యమంత్రి చేసుకొనేందుకు ప్రతి నాయకుడు ,కార్యకర్త నడుం బిగించవలసిన సమయం ఆసన్నమైందని తెలియజేసారు.పార్టీ అధికారంలో ఉన్న లేకున్నా ఉత్సాహంగా ,ఉల్లాసంగా కమిటీ నియామకాలల్లో



నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేయడం అత్యంత సంతోషం కలిగించే విషయం అని అన్నారు.మనం అంత సమిష్టిగా పనిచేసి 2029 లో జగన్ అన్న ను ముఖ్యమంత్రి ని చేసుకొందాం అని చెప్పారు.

## సీఎంను కలిసిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ: నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ



**మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, ఎమ్మెల్యే తన నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన విషయాలపై కూడా వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి సీఎంకు ఎమ్మెల్యే తెలియజేశారు.

## మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కు జన్మ దిన వేడుకలు

*ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి*



**ఒంగోలు క్రైమ్ కౌంటర్ ప్రతినిధి**,మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పుట్టిన రోజు సందర్భంగా విజయవాడ లోని లెమన్ ట్రీ హోటల్ లో ఏర్పాటు చేసిన పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి రెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలను తెలియ జేశారు.

## బొత్స ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కదిరి




**పామూరు, మార్చి 6, క్రైం కౌంటర్** శాసన మండలి ప్రతిపక్ష నేత ,మాజీ మంత్రివర్యులు బొత్స సత్యనారాయణ ఇటీవల అస్వస్థత కు గురై హైదరాబాద్ లో చికిత్స చేయుంచు కొని విజయవాడకు చేరుకున్నారు .విషయం తెలుసుకున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు బొత్స నివాస గృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగితెలుసుకున్నారు.ఈ కార్యక్రమం లో మాజీ మంత్రివర్యులు అంబటి రాంబాబు, చెల్లుబోయిన వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

## వివాహ వేడుకలో పాల్గొన్న.. ఏఎంసి యారవ రమా శ్రీనివాస్, బొల్లా నరసింహారావు



**పామూరు, మార్చి 6, క్రైం కౌంటర్** తూర్పు కట్టక్రిందపల్లి పాలపర్తి రమణయ్య కుమారుని వివాహ కార్యక్రమంలో కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ , పామూరు మండల టీడీపీ అధ్యక్షుడు బొల్లా నరసింహారావు , వైస్ ఏఎంసీ పాలపర్తి వెంకటేశ్వర్లు ,పోక వినోద్ కుమార్ మరియు టీడీపీ నాయకులు పాల్గొని నూతన వరుడుని ఆశీర్వదించారు.

## అల్లు వారి వివాహ వేడుకలో మంత్రి కొలుసు, కదిరి కుటుంబ సభ్యులు





**పామూరు, మార్చి 6, క్రైం కౌంటర్** కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సోదరి అల్లు తనూజ, శ్రీనివాస్ కుమారుడు అల్లు గిరి వెంకటేష్,తేజస్వీ ల వివాహ వేడుక గురువారం రాత్రి విజయవాడ లో వైభవం గా జరిగింది. ఈ వివాహ వేడుకలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి ,మాజీ యంపి బొత్స ఝాన్సీ ,కనిగిరి మాజీ ఎమ్మెల్యే వైసీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు, ఎమ్మెల్యే లు బొండ ఉమామహేశ్వర రావు, బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజా లు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కదిరి ప్రకాశ్ రావు, కదిరి పార్థసారధి, కదిరి బాలకృష్ణ, ఆప్టా వ్యవస్థాపక అధ్యక్షులు చందు శ్రీనివాస్,రక్షిత ఫార్మసి కంపెనీ అధినేత చందన రామేశ్వర రావు, సుంకరి వెంకటాద్రి,కదిరి పిచ్చయ్య, కదిరి రమణయ్య,కదిరి కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## పల్లెపండుగ రూపంలో గ్రామీణ రోడ్ల నిర్మాణం: మంత్రి నాదెండ్ల మనోహర్

**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీ శాసనసభలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. పల్లెపండుగ 2.0 అమలుపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రశ్న అడిగారు. పల్లెపండుగ కార్యక్రమంలో వేలాది కిలోమీటర్లు రోడ్లు వేశారని.. దీనివల్ల ఎమ్మెల్యేలంతా గౌరవంగా గ్రామాల్లోకి వెళ్లగలుగుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ నిబంధనలను కేంద్రం మార్చిందని.. దీంతో రాష్ట్ర వాటా 10శాతం నుంచి 40శాతానికి పెరిగిందని చెప్పారు. ఆ మేరకు బడ్జెట్‌లో రాష్ట్ర కేటాయింపులు పెంచాలని ఎమ్మెల్యే కోరారు.

వైసీపీ హయాంలో జలజీవన్ మిషన్ పథకం సద్వినియోగం చేయలేదని.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ (ణవజూబ్ఎ జవీ్ఖుఝఅ ఖుశ్రీఝఅ) చొరవతో కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరగా పనులు పూర్తి చేసి గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉంటుందని.. గతంలో డ్రైనేజీలకు నిధులు ఇవ్వలేదని... ఈసారైనా నిధులివ్వాలన్నారు. పనిదినాలను125 రోజులకు పెంచారని.. దీని వల్ల రాష్ట్రానికి 5 కోట్ల పనిదినాలు పెరిగాయని తెలిపారు. పనులకు సంబంధించి కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని... వాటిని మంజూరు చేయాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు.

ఈ ప్రశ్నకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మంత్రి పవన్ కళ్యాణ్‌కు బదులు మంత్రి నాదెండ్ల మనోహర్ సమాధానం ఇచ్చారు. ఉపాధి హామీ పథకం కింద పల్లెపండుగ రూపంలో గ్రామీణ రోడ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, ఇంకుడు గుంతలు, మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు. 2025-26 కోసం బడ్జెట్‌లో రూ.4350కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. 2022 నుంచి ఇప్పటి వరకూ చేపట్టిన పనులకు సాస్కి కింద రూ.1342కోట్లు వచ్చాయని మంత్రి వివరించారు. పల్లెపండుగ 1 కింద 4 వేల కిలోమీటర్ల మేర వివిధ రోడ్లు వేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు1594 కిలోమీటర్ల



రహదారులు వేసినట్లు చెప్పారు.

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో 21.30 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లు వేశామన్నారు. డ్రైనేజీ వ్యవస్థలో ఇదో విప్లవమని... చాలాచోట్ల ఈ డిమాండ్ ఉందని చెప్పారు. గత వైసీపీ హయాంలో రూ.13,300 కోట్ల మేర జలజీవన్ మిషన్ నిధులు నిలిచిపోయాయని తెలిపారు. ఉపాధిహామీ పథకంలో నిబంధనలు మార్చారని.. దీనిపై పూర్తిస్థాయిలో మార్గదర్శకాలు రాలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

## రైతన్నల సమస్యను పరిష్కరిస్తాం: మంత్రి టీజీ భరత్



**అమరావతి, మార్చి 06 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** ప్రత్యేక ఆర్థిక మండళ్లకు భూ సేకరణలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారంపై ఏపీ అసెంబ్లీలో చర్చించారు. ఈ విషయంపై ఎమ్మెల్యేలు సుందరపు విజయ్ కుమార్, యనమల దివ్య ప్రశ్నించారు. గత పదిహేను సంవత్సరాలుగా పరిహారం ఇవ్వకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేలు చెప్పారు. రైతులు చాలామంది చనిపోయారని, వారి వారసులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. స్థానికంగా తాము రైతులకు సమాధానం చెప్పుకోలేకపోతున్నామని తెలిపారు. అన్ని ప్రాంతాలకు ఒకే పాలసీ పెట్టి అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఐదువేల ఎకరాలు సేకరించారు: మంత్రి టీజీ భరత్ ఈ విషయంపై ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సమాధానం ఇచ్చారు. అచ్యుతాపురం సెజ్‌కు ఐదువేల ఎకరాలు సేకరించారని ప్రస్తావించారు. అప్పటి భూమి ధర ప్రకారం కాకుండా ఇప్పటి ధర ప్రకారం రైతన్నలు పరిహారం అడుగుతున్నారని తెలిపారు. ఈ విషయంపై అన్నదాతలతో అధికారులు మాట్లాడుతున్నారని చెప్పుకొచ్చారు. స్థానిక ఎమ్మెల్యేలు ఈ విషయంలో సంప్రదింపులు చేయాలని కోరారు. కాకినాడ సెజ్ కోసం 4 వేల ఎగరాలను రైతన్నల నుంచి తీసుకున్నారని ప్రస్తావించారు. అక్కడ కూడా కొందరు రైతులకు పరిహారం అందలేదన్నారు. వారి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని మంత్రి టీజీ భరత్ పేథ?్కన్నారు.

## నెల్లూరు జిల్లాలో రెచ్చిపోయిన వైసీపీ మూకలు.. ఏం చేశారంటే..

**నెల్లూరు, మార్చి 6 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో రాజకీయ సెగలు మరోసారి రాజుకున్నాయి. చెన్నాయపాళెంలో వైసీపీ తెలుగుదేశం శ్రేణుల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. చెన్నాయపాళె ప్రాంతంలో వైసీపీ మూకలు ఒక్కసారిగా రెచ్చిపోయాయి. టీడీపీ శ్రేణులపై మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. టీడీపీ కార్యకర్తలపై విచక్షణా రహితంగా వైసీపీ మూకలు కర్రలతో దాడి చేశారు.

ఘర్షణలో టీడీపీ శ్రేణులకు గాయాలు..

ఈ దాడిలో టీడీపీ శ్రేణులు శ్రీకీర్తి ప్రభాకర్, రామకోటయ్య గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉండటంతో కావలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి వారిని నెల్లూరు నారాయణ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం వారికి వైద్య చికిత్స అందిస్తున్నారు.

సన్నిబోయిన ప్రసాద్‌పై ఆరోపణలు..

మాజీ ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ వరస ఘర్షణలు సృష్టిస్తూ స్థానికంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కూడా సన్నిబోయిన ప్రసాద్ వైఖరీలో ఎలాంటి మార్పు లేదని టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. వైసీపీ కార్యకర్తలు విచక్షణా రహితంగా కర్రలతో దాడి చేయడంతో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. సన్నిబోయిన ప్రసాద్ తమపై వరుస దాడులు చేస్తున్నారని.. ఆయన, అనుచరుల వల్ల ఇప్పటివరకు 15 సార్లు




ఘర్షణలు చెలరేగాయని టీడీపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేశారు. సన్నిబోయిన ప్రసాద్ కావాలనే ఘర్షణలు సృష్టిస్తూ గ్రామంలో అలజడి రేపుతున్నారని టీడీపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితి..

ప్రస్తుతం చెన్నాయపాళెంలో ఉద్రిక్తత కొనసాగుతోంది. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో భారీగా పోలీసు బలగాలను మోహరించినట్లు తెలుస్తోంది. బాధితులకు న్యాయం చేయాలని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రైం కౌంటర్ క్రిష్ణా

# విద్యతోపాటువిహారయాత్రల ద్వారా విజ్ఞానం అలవర్చుకోవాలన్న చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి





**ఏలూరు జిల్లా ముదినేపల్లి:::క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి:::** విద్యతొపాటువిహారయాత్రల ద్వారా విజ్ఞానం అలవర్చుకొవాలన్న చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి కైకలూరు నియోజకవర్గ ఏం.ఎల్.ఏ.కామినేని శ్రీనివాస్ ఆదేశానుసారం తెలుగుదేశం పార్టీ మాజీ మండలాధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి అధ్యక్షతన వారి తనయుడు ఆదిత్య చౌదరి ఆధ్వర్యములో పెదపాలపర్రు లోని ఈదర శోభనాద్రి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ,విద్యారులుని అమరావతి లోని సచివాలయ సందర్శనకి వెళ్లివచ్చిన విద్యార్థిని,విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియచేసి,ఆనంతరం చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి మాట్లాడుతూ మాపూర్వికులు కట్టించిన ఈ పాఠశాలలో ఎంతోమంది విద్యార్థిని,విద్యార్థులు దేశ,విదేశాలలో ఉన్నత పదవులు,ఉద్యోగ,వ్యాపారలలొ స్థిరపడి పాఠశాలకు మంచి పేరు,గుర్తింపును తీసుకువస్తున్నందుకు ఆనందముగా ఉందని,నేటి బాలలే రేపటి పౌరులని, విద్యార్థిని,విద్యార్థులు విద్యతొ పాటు విజ్ఞానాన్నికూడా పెంపొందించు కోవాలని,విహార యాత్రల సందర్శన ద్వారా జ్ఞానాన్ని పెంపోదించుకొని చరిత్రలోని ప్రముఖులు నిర్మించిన స్థలాలు,చిత్రాలను సందర్శించినప్పుడు మధురానుభూతని పొంది,కళా సంపదని, మీరు కూడా భావితరాలకు తెలియచేయటానికి దోహద పడుతుందని చెప్పి అమరావతి లోని సచివాలయ సందర్శన గురించి విద్యార్థిని,విద్యార్డులని అడుగగా సచివాలయం లోని స్పీకర్ అయ్యన్న పాత్రుడు,హోమ్ శాఖ మంత్రి అనితలని కలిసామని,అసెంబ్లీ సమావేశ పు గదిని చూసామని, అసెంబ్లీ ప్రాంగణం అంతా చూసామని,ఉండవల్లి లోని అనాటి రాజులు నిర్మించిన కొండలలోని గృహలు చూసామని,అనంత పద్మనాభస్వామీ పెద్ద దేవతా విగ్రహాన్ని చూసి మధురానుభూతిని పొందామని,స్పీకర్ అయ్యన్న పాత్రుడు మావివరాలు తెలుసుకొని తన సొంత ఖర్చులతో పోలవరం ప్రాజెక్ట్ కూడా చూడటానికి పంపిస్తామన్నారని, ఈ సందర్శన అవకాశం కల్పించినందుకు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరికి, వారి తనయుడు ఆదిత్య చౌదరికి,ఏం.ఎల్.ఏ.కామినేని శ్రీనివాస్ కి,స్కూల్ అధ్యాపక సిబ్బందికి,స్కూల్ అభివృద్ధి కమిటీ మెంబర్ గన్నమనేని వెంకటేశ్వరరావు కి ప్రత్యేక ధన్యవాదములు తెలియచేస్తున్నామన్నారు

# స్వయం ఉపాధి మహిళా సాధికారతకు బలమైన పునాది..

**ఆదాయ వనరు మాత్రమే కాదు ఆత్మవిశ్వాసానికి మార్గం కూడా..**
**-జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం,మార్చి 06(క్రైం కౌంటర్ బ్యూరో చీఫ్ సల్మాన్):** మహిళలు స్వయం ఉపాధి రంగంలో ముందడుగు వేస్తే కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా సమాజ అభివృద్ధికి కూడా బలమైన పునాది ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

ఇబ్రహీంపట్నం మండలం, కిలేశపురంలో పి.ఉమ అనే మహిళ పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ స్కీమ్ (పీఎంఎఫ్ఎంఈ) పథకం చేయూతతో ఇప్పటికే ఒక ఎద్దు గానుగ యూనిట్‌ను ప్రారంభించగా మరో యూనిట్ ను కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మహిళ ఆర్థికంగా స్వావలంబన సాధిస్తే ఒక కుటుంబం బలపడుతుంది; మహిళల సమూహం ముందుకు వస్తే సమాజం బలపడుతుంది.. అని తెలిపారు. స్వయం ఉపాధి మహిళలకు కేవలం ఆదాయ వనరు మాత్రమే కాదు, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని ఇచ్చే మార్గం అని పేర్కొన్నారు. మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల ద్వారా మహిళలకు శిక్షణ, రుణ సదుపాయాలు, మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాలను వినియోగించుకుని మహిళలు చిన్న వ్యాపారాలు, హస్తకళలు, ఆహార పదార్థాల తయారీ, సేవా రంగాలలో అడుగుపెట్టి తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు.



కార్యక్రమం అనంతరం కలెక్టర్ లక్ష్మీశ.. నీతి ఆయోగ్ అధికారి రాధికా ములేతో కలిసి జూపూడిలో పర్యటించారు. స్థానిక కార్యాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను వివరించారు. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో అమలవుతున్న ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం – సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా రాధికా ములే జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు ఆకాంక్షిత మండలాల్లో వివిధ ప్రగతి సూచికల్లో పురోగతిని పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్ డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందే.. ట్రంప్ స్పష్టీకరణ



**ఇంటర్నెట్ డెస్క్:** ఇరాన్‌తో ఎలాంటి డీల్ ఉండదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ బేషరతుగా లొంగిపోవాల్సిందేనని తేల్చి చెప్పారు.

ఈ మేరకు తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో తాజాగా పోస్టు పెట్టారు. ఇరాన్‌తో యుద్ధం మొదలై నేటికి 7వ రోజు కావడంతో ట్రంప్ ఈ మేరకు స్పందించారు. ఇరాన్ లొంగిపోయిన అనంతరం దేశాన్ని ముందుకు నడిపించే నాయకత్వ ఎంపిక ఉంటుందని అన్నారు. ఆ తరువాత ఇతర మిత్రదేశాలతో కలిసి తాము ఇరాన్ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తామని చెప్పారు. ఇరాన్‌కు అద్భుత భవిష్యత్తు ఉంటుందని చెప్పుకొచ్చారు ఇదిలా ఉంటే, ఇరాన్ యుద్ధంపై ఐరోపా దేశాల్లో కూడా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ యుద్ధానికి యస్ చెప్పేది లేదని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంఛెజ్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై విమర్శలు గుప్పించారు. ఇరాన్‌పై అమెరికా యుద్ధం ఒక అసాధారణ తప్పిదమని వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై దాడులకు వీలుగా స్పెయిన్ దక్షిణ భాగంలో సైనిక స్థావరాలను కలిసి నిర్వహిద్దామన్న ట్రంప్ ఆఫర్‌ను కూడా ప్రధాని శాంఛెజ్ తిరస్కరించారు. ఇక యుద్ధం ఇలాగే మరో రెండు మూడు వారాల పాటు కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందని ఖతర్ ఇంధన శాఖ మంత్రి తాజాగా హెచ్చరించారు. బ్యారెల్ ముడి చమురు ధర 150 డాలర్లకు చేరే అవకాశం ఉందని వార్నింగ్ ఇచ్చారు.

# ఇంగ్లండ్‌పై భారత్ అద్భుత విజయం సాధించింది: సీఎం చంద్రబాబు

**ఇంటర్నెట్ డెస్క్:** టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్లో గెలుపొంది తుది పోరుకు అర్హత సాధించిన భారత జట్టుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. ఇంగ్లండ్‌పై టీమ్‌ఇండియా అద్భుత విజయం సాధించిందని 'ఎక్స్' వేదికగా కొనియాడారు. న్యూజిలాండ్‌తో ఈ నెల 8న జరిగే ఫైనల్ మ్యాచ్‌లో కూడా ఇదే జోరు కొనసాగించి మరోసారి ప్రపంచ కప్‌ను ముద్దాడాలని ఆయన ఆకాంక్షించారు.ఎంతో అద్భుతమైన మ్యాచ్! ఇంగ్లండ్‌పై అద్భుతమైన విజయం సాధించి ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరిన టీమ్‌ఇండియాకు అభినందనలు. సంజూ శామ్సన్, శివమ్ దూబెల మెరుపు ఇన్నింగ్స్, జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యాల చక్కటి బౌలింగ్, అక్షర్ పటేల్ చురుకైన ఫీల్డింగ్‌తో మంచి ప్రదర్శన చేశారు. ఉత్కంఠ పోరులో సమష్టి పోరాటంతో భారత జట్టు గొప్ప విజయం సాధించి తుదిపోరుకు చేరింది. ఫైనల్లోనూ ఇదే ఆటతీరును ప్రదర్శించాలని కోరుతున్నా' అని చంద్రబాబు అన్నారు.

# ఫోరం.ఫర్.అర్.టీ.ఐ.ఆధ్వర్యంలో అమరావతి కి జీవం పోద్దాం కార్యక్రమం



**ఏలూరుజిల్లా ముదినేపల్లి::::క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి::::** ఫోరం.ఫర్.అర్.టీ.ఐ.ఆధ్వర్యంలో అమరావతి కి జీవం పోద్దాం కార్యక్రమం కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండలం పెదపాలపర్రు లో నివసిస్తున్న ఫోరం ఫర్ అర్.టీ.ఐ. జాతీయ కార్యదర్శి బి.బి.వి.నరసింహారావు సవినయంగా తెలియచేస్తున్న అంశంలోని విషయాలపై చర్చించి, జాతీయ గౌరవ అధ్యక్షులు పత్తిపాటి చంద్రమోహన్,జాతియ అధ్యక్షులు మట్టా ప్రసాద్,జాతీయ ఉపాధ్యక్షులు నడా విక్టర్ పాల్ సలహా, సూచనలతో జరుపబడుచున్న "అమరావతి కి జీవం పోద్దాం"రాష్ట్ర రాజధాని నిర్మాణం లో భాగస్వాములమవుదాం"అనే నినాదంతో అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి పిలుపుతో ఏకీభవిస్తూ ఫోరమ్ ఫర్ అర్.టీ.ఐ.ఆధ్వర్యంలో అంబుల వైష్ణవికి,ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ లు ముఖ్య అతిధులుగా విచేస్తున్నారని తొందరలో జాతీయ,రాష్ట్రంలో వివిధ హోదాలలో ప్రజాసేవ చేస్తున్న ఫోరం ఫర్ అర్.టీ.ఐ.కుటుంబ సభ్యులందరూ పాల్గొని తమవంతుగా అమరావతి అభివృద్ధికి,నవ్యాంధ్ర నిర్మాణానికి మన ఓంతుగా ప్రతి ఒక్కరం 116 రూపాయలు విరాళాలు ఇవ్వటానికి సంసిద్ధులవ్వాలని,అమరావతి రాజధాని నిర్మాణానికి విరాళాలు ప్రభత్వం ద్వారా సీ.అర్.డీ.ఏ. కి స్కాన్ చేసిన అందరికి డాక్టర్ మనోజ్ పాద పూజ చేసి దుస్సాలువాలతో ప్రతి ఒక్కరికి సన్మానం చేస్తారని,తొందర్లో కార్యక్రమం నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామని, సమయం,తారీకు,కార్యక్రమం నిర్వహించే ప్రదేశం త్వరలో తెలియచేస్తామని జాతీయ కార్యదర్శి బి.బి.వి.నరసింహారావు తెలియచేసారు

# రామ్మోహనరావు 21వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి..

*ఘన నివాళి అర్పించిన ఆర్టీసీ కార్మికుల నేషనల్ మజ్దూర్ యూనియన్..*



**ఎన్టీఆర్ జిల్లా,ఇబ్రహీంపట్నం,మార్చ్06(క్రైంకౌంటర్ డెస్క్):** విజయవాడ డివిజన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో నందు నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ స్థాపించి ఎంతోమంది కార్మికుల హక్కుల కోసం పోరాడి, వారి జీవితాల్లో వెలుగు నింపిన పి.రామ్మోహనరావు 21వ వర్ధంతి సందర్భంగా ఆయనకు డిపో నందు ఉద్యోగులు ఘన నివాళులు అర్పించారు. గురువారం నాడు జరిగిన కార్యక్రమం లో డిపో సెక్రటరీ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మిక వర్గం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయం అని కొనియాడారు,అలాగే డిపో చైర్మన్ కే ఎన్ రావు మాట్లాడుతూ కార్మికుల ఆశయ సాదన కోసం పని చేసిన మహోన్నత వ్యక్తి రామ్మోహనరావు అని ప్రతి యొక్క ఉద్యోగి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.కార్యక్రమం లో ఆఫీస్ అసిస్టెంట్ సాంబశివరావు జాయింట్ సెక్రటరీ జె. శేఖర్ అసిస్టెంట్ సెక్రటరీ శేఖర్ ప్రతినిధి పఠాన్ కాస్సిమ్ డ్రైవర్ అసోసియేషన్ సెక్రటరీ జె ఎస్ రావు రాధాకృష్ణ వెంకటేశ్వర్లు గ్యారేజ్ మెంబెర్ ప్రసాద్ నరేష్ తదితరులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

# లిక్కర్ స్కాంలో భారీగా ఆస్తులు అటాచ్



**అమరావతి, మార్చి 06 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీ లిక్కర్ స్కాంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో పలువురి నిందితుల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డి, చాణక్యలకు సంబంధించిన రూ.441 కోట్ల ఆస్తులను శుక్రవారం అటాచ్ చేసింది ఈడీ. ఈ మొత్తంలో స్థిర, చరాస్తులు ఉన్నాయి. షెల్ కంపెనీల ద్వారా రూ.104 కోట్లు వీరు కొల్లగొట్టారంటూ ఈడీ వివరించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

క్రైమ్ కౌంటర్
సినిమా

శనివారం 07 మార్చి 2026



# ఒకప్పుడు అమీన్‌పూర్ కోకాకోలా కంపెనీలో నార్మల్ ఉద్యోగి

కమెడియన్ మహేష్ అచంట గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. జబర్దస్త్ కామెడీ షో ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టి ఇప్పుడు నటుడిగా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుత తన సినీ ప్రస్థానాన్ని వివరించారు. తన ప్రయాణం కోకాకోలా కంపెనీలో సాధారణ ఉద్యోగిగా ప్రారంభమైందని. నెలకు ఆరు వేల రూపాయల జీతంతో మియాపూర్ సమీపంలోని అమీన్‌పూర్‌లో కొకొకల కంపెనీలో పనిచేసేవాడినని గుర్తుచేసుకున్నారు.. రాత్రి పది గంటల నుండి ఉదయం ఆరు గంటల వరకు షిఫ్ట్ చేస్తూ, పగటిపూట అవకాశాల కోసం అమీర్‌పేట, కృష్ణానగర్, హైటెక్ సిటీ, ఫిలింనగర్ వంటి ప్రాంతాల్లో నడుచుకుంటూ తిరిగేవాడినని అన్నారు.. నిజాంపేటలోని స్నేహితుడి సోదరుడి ఇంట్లో భోజనం చేసి, మళ్ళీ రాత్రిపూట ఉద్యోగానికి వెళ్లేవారు. ఒకసారి నిద్రలేమి కారణంగా 250 కేస్‌ల కొకొకల లోడ్‌ను తప్పుగా పంపడంతో మేనేజర్ "సినిమాలైనా చేయి, ఉద్యోగమైనా చేయి, రెండూ నీకు సెట్ అవ్వవు" అని చెప్పి ఉద్యోగం నుండి తొలగించారట.ఉద్యోగం కోల్పోయిన తర్వాత, అవకాశాల కోసం తిరుగుతున్న సమయంలో 2012లో తన తండ్రి మరణించారని. తండ్రి అంత్యక్రియలకు కూడా డబ్బులు లేని దుస్థితి ఎదురైందని ఎమోషనల్ అయ్యారు.. చిన్ననాన్నలు, తల్లిదండ్రుల చెల్లెళ్ల భర్తలు కలిసి సుమారు 50,000 రూపాయలు సమకూర్చి అంత్యక్రియలు పూర్తిచేశారని.. ఈ సమయంలో కొంతమంది బంధువులు ఉద్యోగం చేసుకోవాలని సూచించారని అన్నారు. కానీ తన తల్లి మాత్రం ఎప్పుడూ తనను నిరుత్సాహపరచలేదని. ఒకసారి హైదరాబాద్ నుండి సొంత ఊరికి వెళ్లడానికి 101 రూపాయల ట్రైన్ టికెట్ కోసం డబ్బులు అడగాలనిపించక, తల్లి దగ్గరకు వెళ్లినప్పుడు, ఆమె తన నెల జీతం నుండి వెయ్యి రూపాయలు ఇచ్చి జాగ్రత్తగా చూసుకోమని చెప్పిందని అన్నారు.
జబర్దస్త్ అవకాశం కమెడియన్ సత్య, రైటర్ ప్రసన్న కుమార్ ద్వారా లభించిందని .. వారు తనను శకలక శంకర్‌కు పరిచయం చేశారు. జబర్దస్త్‌లో తన మొదటి స్కిట్‌లోనే రోజా గారి ప్రశంసలు వచ్చాయని అన్నారు. ఆ తర్వాత పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన లోఫర్ సినిమాలో పది రోజుల పనికి 30,000 నుండి 50,000 రూపాయలు నాగబాబు ఇప్పించారని.. అప్పట్లో ఆ డబ్బును తన కుటుంబ అవసరాలకు, ఇంటికి పంపించడానికి ఉపయోగించినట్లు చెప్పారు..రంగస్థలం సినిమా అవకాశం కోసం మహేష్ అచంట అనేక సంవత్సరాలు కష్టపడ్డారు. కొకొకల ఉద్యోగం చేస్తున్న రోజుల్లో కూడా ప్రతిరోజు ఉదయం ఐదు, ఆరు గంటలకే సత్యసాయి నగర్‌లోని సుకుమార్ ఇంటి ఎదురుగా ఉన్న సిమెంట్ దిమ్మెపై కూర్చునేవారు. ప్రసాదం, పది రూపాయల భోజనం, ఐదు రూపాయల కూరతో ఆకలిని తీర్చుకుంటూ అవకాశాల కోసం నిరీక్షించారు. "అమ్మ నాన్నలకి సాయం చేయడం అనేది మొక్క మొదట్లో నీళ్లు పోసినట్టు" అనే సిద్ధాంతాన్ని నమ్మిన మహేష్, తనకు వచ్చిన ప్రతి చిన్న మొత్తాన్ని తన తల్లికి పంపేవారు. ఈ పట్టుదల, సుకుమార్ గారి దయతో రంగస్థలం సినిమాలో నటించి మంచి గుర్తింపు పొందారు. ఈ విజయం తర్వాత తన స్వగ్రామంలో నాలుగు సెంట్ల స్థలంలో ఇల్లు నిర్మించుకొని తన తల్లికి అంకితం చేశారు.





# పొద్దు పొద్దున్నే అరటి పండు తింటున్నారా..?

అరటి పండులో ఎన్నో పోషకాలు ఉంటాయి. పొటాషియం, విటమిన్ బి6, మెగ్నీషియం ఇందులో సమృద్ధిగా ఉంటాయి. దీని వలన జీర్ణశక్తి పెరగడంతో పాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఉదయాన్నే నిద్రలేవగానే అరటి పండు తినడం మంచిదేనా ? అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియంతో పాటు అరటి పండులో నేచురల్ షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉండటం వలన బీపీ పెరిగి, రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. అరటిపండులో పొటాషియం ఎక్కువగా ఉండటంతో గుండె ఆరోగ్యానికి కూడా ఇది మేలు చేస్తుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడటంలో కూడా అరటిపండు ఉపయోగపడుతుంది.
ఉదయాన్నే అరటిపండు తింటే శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇది సహజమైన చక్కెరలు (గ్లూకోజ్, ఫ్రుక్టోజ్, సుక్రోజ్) కలిగి ఉండటం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా అరటిపండు ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే ఫైబర్ వల్ల కడుపు సక్రమంగా పనిచేస్తుంది. ముఖ్యంగా మలబద్ధకం సమస్య ఉన్నవారికి ఇది మంచి పరిష్కారంగా ఉంటుంది. ఉదయం అరటిపండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేసే అవకాశం ఉంది. మానసిక ఆరోగ్యానికి కూడా అరటిపండు ఉపయోగకరం. ఇందులో ట్రిప్టోఫాన్ అనే పదార్థం ఉండటంతో ఇది శరీరంలో సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచి మూడ్‌ను మెరుగుపరుస్తుంది. దీంతో ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుంది.
అరటిపండులో పొటాషియం, ఫైబర్, విటమిన్ , విటమిన్ 6 వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఉదయాన్నే అరటి పండు తినడం వలన ఇన్‌స్టాంట్ ఎనర్జీ లభిస్తున్నప్పటికీ ఆరోగ్యనిపుణులు ఇది మంచిది కాదని తెలిపారు. ఉదయాన్నే అరటి పండు తినడం వలన యాసిడిటీ సమస్య రావచ్చని చెబుతున్నారు. ఉదయాన్నే అరటి పండు తినడం వలన తక్షణమే శక్తి లభిస్తుంది. ఇందులో మెగ్నీషియం, పొటాషియం లెవల్స్ సమృద్ధిగా ఉంటాయి. అరటి పండులో తక్కువ కేలరీలు ఉన్నప్పటికీ, అధికంగా తినడం వలన శరీర బరువు పెరిగే అవకాశం ఉంది. అయితే ఖాళీ కడుపుతో ఎక్కువగా అరటిపండ్లు తినడం మంచిది కాదని కొంతమంది నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ లేదా ఆమ్లత్వ సమస్యలు ఉన్నవారు పరిమితంగా తినడం మంచిది. మొత్తానికి ఉదయం ఒక అరటిపండు తినడం శరీరానికి శక్తి, జీర్ణక్రియ, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అయితే సమతుల ఆహారంతో పాటు తీసుకుంటే మరింత ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు.



# వారెవ్వా.. అమేజింగ్..

ఉదయం లేవగానే చాలా మంది టీ లేదా కాఫీలు తాగడానికి అలవాటు పడిపోయారు. కానీ, ఒకసారి పరగడుపున కొబ్బరి నీళ్లు తాగి చూడండి.. మీ ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో మీ శరీరమే ఆ తేడా చెబుతుంది. రాత్రంతా నిద్రపోవడంతో శరీరం నీటిని కోల్పోతుంది. ఉదయం కొబ్బరి నీళ్లు తాగితే శరీరం రీఫ్రెష్ అయిన ఫీలింగ్ కలిగిస్తుంది. శరీరానికి ఇది తక్షణ శక్తిని అందిస్తుంది. అలసట, బలహీనత తగ్గడానికి కూడా ఇది సహాయపడుతుంది. కొబ్బరి నీళ్లలో ఉండే సహజ ఎలక్ట్రోలైట్స్ శరీరానికి కావాల్సిన ద్రవాలను భర్తీ చేయడంలో సహాయపడతాయి. ఉదయం పరగడుపున తాగితే శరీరం తేలికగా అనిపించి, అలసట తగ్గిన భావన కలుగుతుంది. దీంతో రోజును తాజాగా ప్రారంభించడానికి ఇది హెల్ప్ చేస్తుంది.
ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల జీర్ణక్రియకు కూడా మంచిది. ఇది కడుపులోని అసిడిటీని తగ్గించి, గ్యాస్ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. దీనివల్ల కడుపు చాలా తేలికగా అనిపిస్తుంది. అయితే ఇది అసిడిటీ ఉన్నవారికి మందు మాత్రం కాదు. కొబ్బరి నీళ్లలో క్యాలరీలు చాలా తక్కువ. పరగడుపున ఇది తాగడం వల్ల అనవసరమైన ఆకలి తగ్గుతుంది, దీంతో మీరు బ్రేక్ ఫాస్ట్ తక్కువగా తీసుకుంటారు. పైగా టీ కాఫీలతో పోలిస్తే.. ఇది ఆరోగ్యకరం కూడా. దాంతో బరువు తగ్గించేందుకు కూడా పరోక్షంగా సహాయపడుతుంది. అయితే ఇది బరువు తగ్గించే మేజిక్ డ్రింక్ కాదని గుర్తుంచుకోవాలి.
కొబ్బరి నీటిలో పొటాషియం, మాగ్నీషియం, కాల్షియం, సోడియం వంటి ముఖ్యమైన ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. పరగడుపునే కాదు కొబ్బరినీరు ఎప్పుడు తాగినా శరీరాన్ని హైడ్రేటెడ్ గా ఉంచి చర్మం పొడిబారకుండా, వేసవి తాపానికి గురికాకుండా కాపాడుతుంది. దాంతో చర్మాన్ని కాంతివంతంగా ఉంచేందుకు సహాయపడుతుంది. శరీరం హైడ్రేట్‌గా ఉండటం వల్ల చర్మం కాంతివంతంగా కనిపిస్తుంది. అంతేకాకుండా రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా ఇది కొంతవరకు సహాయపడుతుంది.
అయితే ప్రతి ఒక్కరికీ ఒకే విధంగా ప్రభావం ఉండకపోవచ్చు. ముఖ్యంగా కిడ్నీ సమస్యలు లేదా పొటాషియం ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోకూడని వారు కొబ్బరి నీరు ఎక్కువగా తాగకూడదు. అలాగే రోజుకు ఒక గ్లాస్ లేదా ఒక కొబ్బరి నీరు సరిపోతుందని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంగా చూస్తే, ఖాళీ కడుపుతో కొబ్బరి నీరు తాగడం చాలా సందర్భాల్లో ఆరోగ్యానికి మంచిదే. అయితే ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్యుల సలహా తీసుకుని తాగడం ఉత్తమం.

# 'వాడే మాకు యముడయ్యాడు.!

2026 టీ20 ప్రపంచకప్ టోర్నమెంట్‌లో రెండో సెమీఫైనల్ మ్యాచ్ భారత్, ఇంగ్లాండ్ మధ్య తీవ్ర ఉత్కంఠభరితంగా జరిగింది. చివరి ఓవర్ల వరకు విజయం ఏ జట్టును వరిస్తుందో ఊహించలేని రీతిలో సాగిన ఈ మ్యాచ్‌లో చివరికి టీమిండియా అద్భుత విజయాన్ని అందుకుని ఫైనల్‌కు చేరుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి భారీగా 253 పరుగులు చేసింది. ఈ కష్టమైన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఇంగ్లాండ్ జట్టు గట్టి పోటీనిచ్చింది, అయితే 246 పరుగులు మాత్రమే చేసి ఓడిపోయింది.
భారత్ బ్యాటింగ్‌లో సంజు శాంసన్ ఒక అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టుకు పటిష్టమైన పునాది వేశాడు. ఆరంభంలోనే వికెట్లు పడినా, పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉందని గ్రహించి అతను దూకుడుగా ఆడాడు. ఆ తర్వాత వచ్చిన టీమిండియా బ్యాటర్లు కూడా అదే జోరును కొనసాగించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. బౌలింగ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా తన పొదుపైన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేయగా, హార్దిక్ పాండ్యా తన చాకచక్యమైన బౌలింగ్‌తో కీలక వికెట్లు తీశాడు.
అయితే, ఈ మ్యాచ్‌లో విజేతగా నిలవడంలో అక్షర్ పటేల్ ఫీల్డింగ్ విన్యాసాలు అతి కీలక పాత్ర పోషించాయి. ఇంగ్లాండ్ బ్యాటర్లు దూకుడుగా ఆడుతున్న ప్రతిసారి, అక్షర్ పటేల్ పట్టిన అద్భుతమైన క్యాచ్‌లు మ్యాచ్ గమనాన్ని మార్చేశాయి. హ్యారీ బ్రూక్ ఇచ్చిన క్యాచ్‌ను వెనక్కి వెళ్లి, ఎగిరి డ్రైవ్ చేస్తూ పట్టడం అద్భుతంగా నిలిచింది. అలాగే, విల్ జాక్స్ కొట్టిన బంతిని బౌండరీ వద్ద అందుకుని శివమ్ దూబేకు అందించిన తీరు వర్ణనాతీతం. జాక్ బెతెల్ సెంచరీతో చెలరేగుతున్న దశలో హార్దిక్ పాండ్యా చేసిన అద్భుతమైన రనౌట్ కూడా టీమిండియా విజయంలో ఒక కీలక మలుపు. అక్షర్ పటేల్ మూడు కీలకమైన క్యాచ్‌లు పట్టి క్రికెట్ ప్రపంచాన్నే ఆశ్చర్యపరిచాడు. ఈ క్యాచ్‌లు పట్టడం అసాధ్యమైనా, అక్షర్ పటేల్ వాటిని సుసాధ్యం చేశాడని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్రశంసించాడు. దీనికి ఫీల్డింగ్ కోచ్ దిలీప్ కుమార్‌కు క్రెడిట్ ఇవ్వాలని కూడా పేర్కొన్నాడు.
మ్యాచ్ అనంతరం టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ స్పందిస్తూ, ఇంగ్లాండ్‌పై గెలవడం ఒక నమ్మశక్యం కాని అనుభూతి అని పేర్కొన్నాడు. ఇంత గొప్ప జట్టుకు నాయకత్వం వహించడం తన అదృష్టంగా భావిస్తున్నానని, వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరడం ఆటగాళ్లందరికీ ఒక ప్రత్యేకమైన భావన అని చెప్పాడు. సంజు శాంసన్ స్పష్టమైన అవగాహనతో బ్యాటింగ్ చేశాడని, ఆరంభంలో వికెట్లు పడినా, పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉందని అతను గుర్తించి అద్భుతంగా ఆడాడని కొనియాడాడు. ఇంగ్లాండ్‌పై గెలవాలంటే ఇంకా ఎన్ని పరుగులు చేసి ఉండాలో అని ఒక దశలో అనిపించిందని, అయితే జస్‌ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్ వంటి బౌలర్లు అద్భుతంగా కట్టడి చేసి మ్యాచ్‌ను తమ వైపు తిప్పారని సూర్యకుమార్ వివరించాడు. మొత్తంగా, జట్టు సమిష్టిగా పోరాడడంతో ఫైనల్‌కు చేరుకున్నామని, ఇక కప్పుకు కేవలం ఒక్క అడుగు దూరంలో నిలిచామని సూర్యకుమార్ యాదవ్ తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు.



# ఆసీస్‌తో ఏకైక టెస్టు:

ఇంటర్నెట్ డెస్క్: పెర్త్ వేదికగా పింక్ బాల్ టెస్టులో భారత్–ఆస్ట్రేలియా మహిళా జట్లు తలపడుతున్నాయి. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన భారత మహిళలు 198 పరుగులకు ఆలౌటయ్యారు. కాగా ఛేదనకు దిగిన ఆసీస్.. తొలి రోజు ఆట ముగిసే సరికి 3 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. ఇంకా ఆసీస్‌పై భారత్ 102 పరుగుల ఆధిక్యంలో ఉంది. ప్రస్తుతం క్రీజులో ఆసీస్ బ్యాటర్ ఎలీస్ పెర్రీ(43) హాఫ్ సెంచరీకి చేరువలో ఉంది. మరో ఎండ్‌లో అన్నాబెల్ సదర్లాండ్(20) కొనసాగుతుంది.
స్వల్ప లక్ష్యంతో ఛేదనకి దిగిన ఆస్ట్రేలియాకు శుభారంభం దక్కలేదు. జార్జియా వాల్(2), ఫోబ్ లిచ్‌ఫీల్డ్(9) స్వల్ప వ్యవధిలోనే పెవిలియన్ చేరారు. కెప్టెన్ అలీసా హీలీ(13) కూడా నిరాశపర్చింది. భారత బౌలర్లలో డెబ్యూ మ్యాచ్ ఆడుతోన్న సయాలీ సత్ఘరే 2, క్రాంతి గౌడ్ 1 వికెట్ పడగొట్టారు. అంతకు ముందు బ్యాటింగ్ చేసిన టీమిండియా 62.4 ఓవర్లలో 198 పరుగులకు కుప్పకూలింది. స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్(52) హాఫ్ సెంచరీ చేసింది. జెమీమా మినహా ఇతర బ్యాటర్లు ఎవ్వరూ ఎక్కువ సేపు క్రీజులో నిలబడలేకపోయారు. భారత బ్యాటర్లలో షఫాలీ వర్మ(35), కాష్వీ గౌతమ్(34) పర్వాలేదనిపించారు. స్మృతి మంధాన(4), ప్రతీకా రావల్(18), హర్మన్ ప్రీత్ కౌర్(19), దీప్తి శర్మ(7), రిచా ఘోష్(11), స్నేహ్ రాణా(5), సయాలీ సత్ఘరే(7) వరుసగా పెవిలియన్ బాట పట్టారు. ఆసీస్ బౌలర్లలో సదర్లాండ్ 4, హామిల్టన్ 3, బ్రౌన్ 2, ఆష్లీ గార్డ్‌నర్ 1 వికెట్ పడగొట్టారు.




Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.AP-522006.published at D.no465 Le out no2,Dodleru Road.Ysr Jagananna colony,Krosuru,Guntur AP-522410. Chief Editor Katikala Vara Prasad Reg No's: RNI APTEL/2015/62250, APTEL/25/A2478 & APTEL/25/A2844,APTEL/25/A2843. Ph:9849707349 .
email:kvp6858@gmail.com, website :www.crimecounter.In